


# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 22-05-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 209 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## బాబు జిల్లాల యాత్రలు చేసి సాధించేది ఏమిటి?

- ఆయన ప్రసంగాలు విని ప్రజలు నవ్వుకుంటున్నారు
- పేపర్ లీకేజీ కేసులో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులను క్షోభకు గురి చేశాడు
- ట్విట్టర్ వేదికగా చంద్రబాబుపై మండిపడ్డ ఎంపీ విజయసాయిరెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్): రాష్ట్రంలో సమయం సందర్భం లేకుండా ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు జిల్లాల యాత్రలు చేసి సాధించేదేమిటని వైఎస్సార్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ట్విట్టర్ వేదికగా శనివారం పలు అంశాలపై ఆయన స్పందించారు. ఈ యాత్రలలో చంద్రబాబు చేస్తున్న పొంతన లేని ప్రసంగాలు విని జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.మరీ విడ్డూరంగా ప్రభుత్వ వ్యతిరేక సందేశాలు పంపండి అని ప్రజలను వేడుకోవడం ఎమిటని ప్రశ్నించారు.

టిడిపి అధినేత చంద్రబాబు టెన్త్ పేపర్ లీకేజ్ కేసులో మాజీ మంత్రి నారాయణను వెనకేసుకు వచ్చి 11లక్షల మంది విద్యార్థులు, 30 లక్షల మంది కుటుంబ సభ్యులను క్షోభకు గురిచేశాడని మండిపడ్డారు. ఈ విషయంలో తన బినామీని కాపాడేందుకు చేసిన రాద్ధాంతాన్ని ప్రజలు అంతా చూశారని చెప్పారు. చంద్రబాబు గంజాయి స్మగ్లర్లపై దాడులు చేస్తే సహించడట! లీగలైజ్ చేయమంటావా ఏంటి అని అయన ప్రశ్నించారు.

**డిజిటల్ హెల్త్ లో ఏపీ టాప్**

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ రూ.వేల కోట్లు వెచ్చించి వైద్య, ఆరోగ్య రంగాన్ని తీర్చిదిద్దుతున్న ఏపీ ప్రభుత్వాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవో డాక్టర్ ఆర్.ఎస్.శర్మ సూచించారని వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమాల అమలులో ఏపీ ప్రథమ స్థానంలో నిలవటాన్ని అభినందిస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు.

## ఫలితాలతో దావోస్ నుంచి తిరిగివస్తాం

### సీఎం జగన్‌కు పేరు, ప్రఖ్యాతలు వస్తుంటే బాబు తట్టుకోలేకపోతున్నారు : మంత్రి గుడివాడ



టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై ఏపీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దావోస్ పర్యటనపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఏపీ రాష్ట్ర ప్రతిష్ట ఏమైపోయినా పర్వాలేదన్నది బాబు ఉద్దేశం. సీఎం వైఎస్ జగన్‌కు పేరు, ప్రఖ్యాతలు వస్తుంటే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. మంచి ఫలితాలతో దావోస్ నుంచి తిరిగివస్తాం" అని స్పష్టం చేశారు.

## విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చి దిద్దాలి

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జిల్లాలో అత్యధికంగా గాలిలో కాలుష్యాన్ని కలిగిస్తున్న పరిశ్రమలను తరచూ తనిఖీ చేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను రాష్ట్ర అటవీశాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , పౌర సరఫరాల శాఖా మంత్రి కరుమూరి వెంకట నాగేశ్వరరావు తో కలసి పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ శాఖ మంత్రి మాట్లాడుతూ విశాఖనగరంలో అత్యధికంగా ఎయిర్ పొల్యూషన్ కలుగజేసే పరిశ్రమలు 374 వరకు ఉన్నాయని, వీటిని తరుచూ తనిఖీ నిర్వహించాలన్నారు. ప్రస్తుతం 81 శాతం ఎయిర్ పొల్యూషన్ ఉన్నదని, వచ్చే సంవత్సరం నాటికి 60 శాతానికిలోపు రావాలని అన్నారు. రాష్ట్రంలో 2,63,014 మంది రైతులకు సంబంధించి బోర్లకు విద్యుత్తు ఇవ్వడం జరిగిందన్నారు. రాబోయే 6 నెలల లోపు ప్రతి రైతు బోరుకు విద్యుత్తు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తామన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి రాష్ట్రంలో ముప్పై ఒక లక్ష అరవై వేలకు పైగా మహిళలకు పట్టాల పంపిణీ చేయడం జరిగిందని, అదే విదంగా 16 లక్షల

తరువాయి 8లో..

## కాకినాడ జీజీహెచ్ వద్ద ఉద్రిక్తత



కాకినాడ: కాకినాడ జీజీహెచ్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతిపై తెదేపా ఏర్పాటు చేసిన నిజ నిర్ధరణ బృందం జీజీహెచ్‌కు వచ్చి.. మార్చురీ గది వద్దకు వెళ్లేందుకు యత్నించింది. దీంతో పోలీసులు బృందాన్ని అడ్డుకున్నారు. బారికేడ్లు తోసుకొని తెదేపా నేతలు ముందుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు, తెదేపా నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. తెదేపా నాయకులు, పోలీసులకు మధ్య జరిగిన తోపులాటలో తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు గాయపడ్డారు. దీంతో ఆయన్ను జీజీహెచ్‌లోకి తీసుకెళ్లి వైద్యం అందించారు. మరోవైపు సుబ్రహ్మణ్యం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఎమ్మెల్సీని అరెస్ట్ చేసే వరకూ తాము సంతకం చేయబోమని అతని కుటుంబ సభ్యులు చెప్పడంతో..

తరువాయి 2లో..

## కేసు.. నివేదికలు రాగానే పూర్తి స్థాయి విచారణ

### ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



తిరుపతి: ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతిపై కేసు నమోదు చేశామని.. సాధ్యమైనంత త్వరగా కేసు విచారణ పూర్తి చేస్తామని ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వైద్య నివేదికలు రాగానే పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. తిరుపతిలో డీజీపీ మీడియాతో మాట్లాడారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో రోడ్డు ప్రమాదాలు, హత్యలు, గృహహింసలపై సమీక్ష నిర్వహించారు. విజయవాడ సామూహిక అత్యాచారం కేసులో పోలీసుల స్పందన సరిగా లేదని.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఉమ్మడి చిత్తూరు సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులను త్వరలో

తరువాయి 2లో..

## భారత్-చైనా సరిహద్దుల్లో ఉక్రెయిన్ పరిస్థితులు : రాహుల్ గాంధీ




దిల్లీ: భారత్-చైనా సరిహద్దుల్లో ఉక్రెయిన్ తరహా పరిస్థితులు నెలకొన్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. భారత్ లోని ప్రజాస్వామ్యం ప్రపంచ ప్రజల మేలు కోసం ఉందని.. దానికి నష్టం వాటిల్లితే అది భూగ్రహానికే సమస్యగా మారుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థ బ్రిడ్జ్ ఇండియా.. లండన్‌లో నిర్వహించిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' అనే ముఖాముఖి సదస్సులో

తరువాయి 2లో..




## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించిన కేంద్రం



దిల్లీ: దేశంలో రోజురోజుకీ ఇంధన ధరల పెరుగుదలతో అల్లాడిపోతున్న ప్రజలకు కేంద్రం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. చమురుపై భారీగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తున్నట్టు వెల్లడించింది. లీటరు పెట్రోల్‌పై రూ.8, లీటరు డీజిల్‌పై రూ.6 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీంతో రాష్ట్రాల్లో పెట్రోల్‌పై అదనంగా మరో రూపాయిన్నర, డీజిల్‌పై అదనంగా మరో రూపాయి తగ్గే అవకాశం ఉంది. గతంలో దీపావళి సందర్భంలోనూ లీటరు పెట్రోల్‌పై రూ.5, లీటరు డీజిల్‌పై రూ.10 చొప్పున తగ్గించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పలు రాష్ట్రాలు కూడా వ్యాట్‌ను తగ్గించడంతో వినియోగదారులకు కాస్త ఊరట కలిగింది. మరోవైపు వంటగ్యాస్ ధరనూ తగ్గిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్దిదారులకు సిలిండర్‌కు రూ.200 చొప్పున సబ్సిడీ(12 సిలిండర్ల వరకూ మాత్రమే) ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

# రక్షణరంగ నిర్మాణ కాంట్రాక్ట్ పనులకు "ఎక్సెన్స్"లు పెంచాలి

## - అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ బాలసతీష్



విశాఖపట్నం (విజయభాను న్యూస్): పెరిగిన నిర్మాణ సామాగ్రి ధరలకు అనుగుణంగా కాంట్రాక్టర్లకు ఇస్తున్న మొత్తాలను పెంచాలనీ మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్) బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ సి.బాల సతీష్ కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. సిరిపురం స్థానిక హోటల్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేవీ, ఆర్మీ, ఎయిర్ఫోర్సు, జెట్టీ వంటి దేశరక్షణ సంస్థల్లో అవసరమైన నిర్మాణాలు చేసేందుకు కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్నామన్నారు. కరోనా నేపథ్యంలో రెండేళ్ళు, ఉక్రెయిన్, రష్యా యుద్ధం కారణంగా పూర్తిగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమ ఆస్థులు తనఖా పెట్టి దేశరక్షణ దృష్టిలో పెట్టుకుని ఎక్కడా పనులు నిలిచిపోకుండా పూర్తి చేస్తున్నామన్నారు. మెటీరియల్ ఖర్చులు వందశాతం పెరిగిపోవడంతో తమకిస్తున్న కాంట్రాక్టు సొమ్ముపై కనీస మొత్తానైనా పెంచాలని కేంద్ర ప్రధాని, డిఫెన్స్, ఆర్థికశాఖ మంత్రులను కోరారు. మాజీ వైస్ చైర్మన్ జి.వి. రవిరాజు మాట్లాడుతూ తమకిచ్చిన సమయాన్ని ఏవిధంగా పెంచారో అదే విధంగా ఎక్సలెన్సు కూడా పెంచాలన్నారు. ఈ రంగంపై పరోక్షంగా లక్షలాది మంది వున్నారని, తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలన్నారు.

ఇప్పటికే రైతులు ఏవిధంగా ఆత్మహత్య చేసుకుంటున్నారో.. ఆ విధంగా కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సమస్యపై విశాఖ నగరంలో గల కాంట్రాక్టర్లు అందరూ కలిసి స్థానిక పార్లమెంట్ సభ్యులు శ్రీ ఎం.వి.వి. సత్యనారాయణ గారిని కలిసి తమ సమస్య పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించడం జరిగిందని తెలియజేసారు. ఈ సమావేశంలో ఏ.ఏ.ఐ. చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర వైస్ చైర్మన్ కాశీవిశ్వేశ్వరరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

---

మొదటి పేజీ తరువాయి

# కేసు.. నివేదికలు రాగానే పూర్తి స్థాయి విచారణ

పునరుద్ధరణ చేస్తామని.. నిషేధిత వస్తువులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలకు పాల్పడితే ఎలాంటివారినైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో సైబర్ క్రైం ఆదోళనకరంగా ఏమీ లేదని.. అయినప్పటికీ సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు డీజీపీ చెప్పారు. కరోనా సమయంలో రాష్ట్రంలో క్రైం రేట్ తగ్గిందన్నారు. ఆ సమయంలో నమోదైన క్రైం రేట్‌ను పోలీసు శాఖ ప్రామాణికంగా తీసుకోవడం లేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి నారాయణ కేసులో ఏపీపీ సుజాత సహకరించకపోవడంతో సస్పెండ్ చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియా సంస్థలు సహకరిస్తే ఫేక్ న్యూస్‌ల వ్యాప్తిని సులభంగా నియంత్రించవచ్చని డీజీపీ వెల్లడించారు.

---

# కాకినాడ జీజీహెచ్ వద్ద ఉద్రిక్తత

పోస్టుమార్టం నిలిచిపోయింది.

**మాపై ఎలాంటి ఒత్తిళ్లు లేవు: పోలీసులు**

"ఈ కేసులో మాపై ఎలాంటి ఒత్తిళ్లు లేవు. శవపంచనామా జరిగితేనే దర్యాప్తు సాగుతుంది. శవపంచనామాకు కుటుంబసభ్యులు సంతకాలు పెట్టాలి. అనుమానాలు మా వద్ద చెప్పాలని కోరుతున్నాం. పోస్టుమార్టం జరిగేలా సహకరించాలని కోరుతున్నాం" అని పోలీసులు తెలిపారు.

## భారత్-చైనా సరిహద్దుల్లో ఉక్రెయిన్ పరిస్థితులు : రాహుల్ గాంధీ

రాహుల్ పాల్గొని మాట్లాడారు. భారత్‌లో రెండు భిన్నమైన సిద్ధాంతాలు కొనసాగుతున్నాయన్న కాంగ్రెస్ నేత.. అభివృద్ధి ఫలాలు కొందరికే అందాలని భాజపా, ఆర్ఎస్ఎస్ భావిస్తుండగా, అందరికీ సమాన అవకాశాలు ఉండాలని తాము కోరుకుంటున్నామని పేర్కొన్నారు. భాజపా, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు. తూర్పు లద్దాఖ్‌లో చైనాతో ఘర్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాహుల్ తప్పుపట్టారు. ఎల్?ఏసీ వద్ద భారత్-చైనా ఘర్షణలను ఉక్రెయిన్-రష్యా విభేదాలతో పోల్చారు. ప్రాదేశిక సమగ్రతను రష్యా గుర్తించడం లేదని, అమెరికాతో స్నేహం పట్ల కోపంతో ఉక్రెయిన్‌పై రష్యా దాడులు చేస్తోందని పేర్కొన్నారు. చైనా కూడా భారత్ పట్ల ఈ రెండు అంశాల ఆధారంగానే గొడవకు దిగుతోందని వ్యాఖ్యానించారు. చైనా వ్యవహారంలో కేంద్రం వైఖరిని రాహుల్ తప్పుబడుతూ.. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చించడానికి అనుమతించకుండా, దీనిపై మాట్లాడే వారి గొంతు నొక్కుతోందని విమర్శించారు. 'ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను అంగీకరించబోమని రష్యా ఆ దేశంతో వాదిస్తోంది. నాటో, అమెరికాలతో సంబంధాలను తెంచుకునేలా చేసేందుకు దాడి చేస్తున్నాం అని పేర్కొంటోంది. ఉక్రెయిన్‌లో జరుగుతున్న దానికి.. లద్దాఖ్, డోక్లాంలో జరుగుతున్న దానికి పోలికలను గమనించాలి. భారతదేశ ప్రాదేశిక సమగ్రతను గుర్తించబోమని చైనా పేర్కొంటోంది. అమెరికాతో భారత్ స్నేహాన్ని అంగీకరించబోమని వ్యాఖ్యానిస్తోంది. దీనిపై చర్చకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడమే సమస్య. భారత్‌లో చైనా దళాలు తిష్ఠ వేశాయి. తూర్పు లద్దాఖ్‌లోని పాంగాంగ్ సరస్సుపై చైనా పెద్ద వంతెనను నిర్మిస్తోంది. అక్కడ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తోంది. కాని దీనిపై కేంద్ర ప్రభుత్వం మాట్లాడకూడదని భావిస్తోంది. దీనిపై చర్చను అణచివేయాలని చూస్తోంది' అని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు.

---

# మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయండి

### - వైద్యులు అంకిత భావంతో పని చేయాలి
### - సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



శ్రీకాకుళం : వైద్యులు, అంగన్వాడి, ఆశా వర్కర్లు అంకిత భావంతో భాద్యతాయుతంగా విధులు నిర్వర్తించినపుడే ప్రసూతి సమయంలో మాతృ మరణాలను అరికట్టగలమని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా స్థాయి ప్రసూతి మరణాల విచారణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్యకార్యకర్తలు ప్రతి ఒక్కరూ భాద్యతాయుతంగా అంకిత భావంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రసూతి మరణాల రేటును 0% కు తీసుకువచ్చేందుకు వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో గత ఏడాది బాతువా, కరజాడ, కోర్లం, మురపాక, కుసిమి పి.హెచ్. సి పరిధి సంభవించిన ప్రసూతి మరణాలు, మాతృ మరణాలకు కారణాలు తెలుసుకున్నారు. గైనకాలజిస్టులు ఉన్నప్పటికీ కె.జి.హెచ్ కి రిఫర్ ఎందుకు చేశారన్న అంశంపై వేంకటేశ్వర, జేమ్స్, కె.జి.హెచ్ ఆసుపత్రులలో విధులలో ఉన్న డాక్టర్ లకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఆదేశించారు పి.హెచ్.సి.లు, సి.హెచ్.సి. లలో వైద్యాధికారులు క్రమం తప్పకుండా వారి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో నమోదయిన గర్భవతులు, బాలింతల వివరాలను తెలుసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యం పట్ల మెడికల్ ఆఫీసర్, అంగన్వాడి సూపర్ వైజర్లు నిరంతరం అప్రమత్తంగా మెలగాలన్నారు. వారి ఆరోగ్యపరిస్థితిపై సంబందిత ఆరోగ్య కార్యకర్తలతో, ఐసీడీఎస్ సిబ్బందితో వైద్యాధికారులు సమీక్షించాలన్నారు. బాలింతలు, గర్భవతులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎప్పుడు ఈ.సి.జి తీసుకోవాలో అన్న విషయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.బి.మీనాక్షి, డి.సి.హెచ్ డా, శ్రీనివాస నాయక్, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డా.ఎన్.అనురాధ, డా. ఉషారాణి, డా. నారీమణి, డా.కృష్ణ మోహన్, డా.అప్పారావు, డెమో పైడి వెంకట రమణ, డి.పి.హెచ్.ఎన్. కె. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

---

### *జిల్లాలో కోఆపరేటివ్ సొసైటీలు ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరించ వద్దు*
### *జిల్లా సహకార అధికారి మురళీకృష్ణమూర్తి*

శ్రీకాకుళం : జిల్లాలోని మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీలు ప్రజల నుండి ఎటువంటి డిపాజిట్లను స్వీకరించవద్దని జిల్లా సహకార అధికారి కె. మురళీకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమీషనర్, రిజిస్ట్రార్ సహకార సంఘాలు, గుంటూరు, జాయింట్ సెక్రటరీ సెంట్రల్ రిజిస్ట్రార్ కోఆపరేటివ్ సొసైటీ న్యూఢిల్లీ వారు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. సహారా కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, లక్నో, ఉత్తరప్రదేశ్, సహరియస్ యూనివర్సల్ మల్టీపర్పస్ సొసైటీ లిమిటెడ్, భోపాల్, మధ్యప్రదేశ్, హుమార ఇండియా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, కలకత్తా, పశ్చిమ బెంగాల్ లకు చెందిన సొసైటీలు ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరించవద్దని ఆ ప్రకటనలో వివరించారు.

---

## లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఉందా? : యనమల



అమరావతి: అనుమతి ఇవ్వకపోయినా సీఎం జగన్ లండన్ వెళ్లడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఉందా? లేక దావోస్‌కు వెళ్లేందుకు మాత్రమే అనుమతించిందా అని ప్రశ్నించారు. లండన్‌కు అనుమతిస్తే అధికార పర్యటనలో ఎందుకు చేర్చలేదని నిలదీశారు. షెడ్యూల్‌లో లేని లండన్‌లో ఎందుకు దిగాల్సి వచ్చిందని ప్రశ్నించారు. దండుకున్న సంపద దాచుకోడానికే లండన్ వెళ్లారనే అనుమానం ప్రజల్లో బలంగా ఉందని ఆరోపించారు. మూడేళ్ల తర్వాత దావోస్ వెళ్లడం రాష్ట్రం కోసమా? అక్రమార్జన తరలింపు కోసమా? అని యనమల మండిపడ్డారు. సొంత, రహస్య పనులకు ప్రజాధనం దుర్వినియోగం చేయడమేంటని ప్రశ్నించిన యనమల.. ఇలా కోర్టు అనుమతితో విదేశీ పర్యటనలకు వెళ్లే పరిస్థితి దేశంలో ఏ సీఎంకు లేదన్నారు. దావోస్‌కు అధికార యంత్రాగంతో కలసి వెళ్లకుండా ప్రత్యేక విమానానికి ఒక ఖర్చు, కమర్షియల్ ఫ్లైట్‌కు మరో ఖర్చు పెట్టడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి ఇది అదనపు భారమవుతుందని పేర్కొన్నారు.

---

### సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించండి
### అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
### జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం : పోషక విలువలుతో కూడిన ఆహారం సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సిడిపిఓలను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐ.సి.డి.ఎస్ పి.డి, సి.డి.పి. ఓ లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన అంగన్వాడి కేంద్రాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేటికీ చేపడుతున్న పనులపై ఆరా తీశారు.

వయస్సుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లల పై ప్రత్యేక దృష్టి సారించి, అంతకు అనుగుణంగా లేని పిల్లలను గుర్తించి మెడికల్ ఆఫీసర్స్ తో పరీక్షలు చేయించి వారు మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. సి.డి.పి ఓలు తరుచూ అంగన్వాడీలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పిల్లలు ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు అభివృధి చెందేలా సత్వరమే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఈ సమీక్షా సమావేశానికి ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.అనంత లక్ష్మి, సి.డి.పి. ఓ తదితరులు పాల్గొన్నారు.

---

## బ్యాంకులు లబ్ధిదారునికి చేయూత నివ్వాలి

### సెర్ప్ కార్యదర్శి అరుణ్ కుమార్




శ్రీకాకుళం : బ్యాంకులు లబ్ధిదారునికి ఎప్పుడూ చేయూత ఇవ్వాలని జిఎడి, సెర్ప్ కార్యదర్శి హెచ్. అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బ్యాంకులు లబ్ధిదారునికి రుణ సహాయం అందించే విధంగా ఉండాలని, ఫుడ్ ప్రాసెసింగ్ కు బ్యాంకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. లబ్ధిదారులు గతంలో తీసుకున్న అప్పులు తిరిగి చెల్లిస్తే రుణాలు తిరిగి ఇస్తారని చెప్పారు. శనివారం బాపూజీ కళామందిర్ లో ప్రధాన మంత్రి - సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం పై సంబంధిత శాఖలతో వర్క్ షాప్ ను నిర్వహించారు. రాష్ట్రంలో పండిస్తున్న పంటల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ చేసి గిట్టుబాటు ధర పొందవచ్చని చెప్పారు. జిల్లాలో కుటీర పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. జీడి పరిశ్రమలను ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా మరింత ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. జిల్లాలో పండించే అపరాలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా మరింత గిట్టుబాటు ఉంటుందని పేర్కొన్నారు. ఆహారం తయారు చేసినపుడు ఆరోగ్య నియమాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. తయారుచేసినవి ఎక్కువ రోజులు నిల్వ ఉండే విధంగా చూడాలని, వీటిని ఇతర దేశాలకు ఉత్పత్తి చేయవచ్చని చెప్పారు. జిల్లాలో తయారు చేసే వస్తువులకు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉందన్నారు. గతంలో జిల్లాలోను, డిఆర్డిఎ ద్వారా మంచి ఉత్పత్తులు తయారు చేశారని, ఉత్పత్తులు అభివృద్ధి చేస్తే మరింత మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు.

సీతంపేట ఆమోదం కంపెనీ ద్వారా పసుపు, పిక్క తీసిన చింతపండు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా శిక్షణ ఇచ్చేటప్పుడు అన్నీ తెలియజేస్తారని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు జిల్లాలో ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉంటే ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల ఉత్పత్తులు ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి - సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం వర్కషాపు ఇంత వరకు ఏ జిల్లాలో నిర్వహించలేదని శ్రీకాకుళం జిల్లాలోనే మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. సీతంపేట ఐటిడిఎ పిఓ బి. నవ్య మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కి ఐటిడిఎ ఎంతో సహకారం అందిస్తున్నట్లు చెప్పారు.

ఫుడ్ ప్రాసెసింగ్ లో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రెన్యూర్ లుగా ఎదగాలన్నారు. సీతంపేట ఐటిడిఎ లో ఉన్న గిరిజనులకు గిట్టుబాటు ధరలు రావడం లేదని చెప్పారు. గిరిజనులకు ఐటిడిఏ నుండి తోడ్పాటు ఇస్తున్నట్లు వివరించారు. గిరిజనులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. ఐటిడిఎ నుంచి ఆమోదం ప్రొడక్షన్ బాగుందని, దానిని ప్రమోట్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుండి సహకారం అందించాలని కోరారు.

## భరణికాన సాయిరాధరావుని
## టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శిగా నియామకం



సబ్బవరం (విజయభాను న్యూస్) : అనకాపల్లి యాదవ సంఘం అధ్యక్షులు భరణికాన సాయినాదరావు ని టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియమించారు. మండల టిడిపి నాయకులు ,మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో శనివారం మాజీ ఎంపీపీ గండి దేముడుబాబు, మిగతా నాయకులు భరణికాన సాయినాధ రావు ఆయన నివాసంలో శాలువా కప్పి పుష్ప గుచ్చం ఇచ్చి ధన్యవాదాలు తెలియజేశారు. అంతేకాకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిక్షణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు అభ్యసించడం ద్వారా జ్ఞాన్ కశక్తి పెంపొందించుకోవడం తోపాటు కొత్త అంశాల పట్ల అవగాహన కలుగుతుందని సోషల్ మీడియా చైర్మన్ సన్ మూర్తి పేర్కొన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో ఈనెల 25 వరకు జరగనున్న వేసవి శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రసంగిం చారు. వేసవి సెల వుల్ వృధా కాకుండా విద్యా ర్థులు ఇతర అంశాల పట్ల దృష్టి పెట్టడం అవసర మని పునరుద్ఘా టించారు. ఈ కార్య క్రమంలో ఎ.ఎస్ రాజా కళాశాల డిగ్రీ, జూని యర్ కాలేజీ ప్రిన్సి పాల్ జగదీష్, జీవి నారాయణ ఏ&ఎన్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రఘుపాత్రుని బాల్జి, చేతివ్రాత ఉపాధ్యా యుడు కే.ప్రసాద్ తదితరులు పాల్గొని... విద్యార్థు లలో చేతి వ్రాత, చక్కగా మాట్లాడుట, క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం వంటివి మానసికోల్లాసం ఇస్తాయి అని పేర్కొన్నారు.

## నర్సీపట్నం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో...
## 24వ తేదీన ఎరువులు వేలం




అనకాపల్లి జిల్లా నర్సీపట్నం (విజయభాను న్యూస్) : జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సీపట్నం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 24 వ తేదీన అనగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు డి ఏ పి ఎరువులను వేలం వేసేందుకు అధికారులు ఆదేశాలు జారీచేశారని వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాట లో పాల్గొని ఎరువులు కొన దలిచినవారు యాక్సిస్ బ్యాంకులో 50 వేలు సరిపడు డిమాండ్ డ్రాఫ్టు తీసుకొని అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది .సదరు వ్యక్తి ఆధార్ కార్డు పాన్ కార్డు యొక్క పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. వేలం పాట నగదుకు సర్వీస్ టాక్స్ 18 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందని గుర్తించాలని వారు కోరారు. ఇంకా ఏమైనా వివరాలు కావలసి ఉంటే ఈ దిగువ ఫోన్ నెంబర్లు సంప్రదించాలని తెలిపారు.83331056413 ఫోన్ నెంబర్ లో సంప్రదించి సందేహాలుంటే తెలుసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి డి అప్పారావు తెలిపారు.

## విద్యార్థులు దేశ భవిష్యత్ పునాదులు
### -ఎస్సీపీసీఆర్ సభ్యుడు సీతారాం




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విద్యార్థులు దేశ భవిష్యత్ కి పునాదులు వంటివారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్(ఎస్సీపీసీఆర్) మెంబర్ గొండు సీతారాం అన్నారు సకల్య ఎన్జీఓ సంస్థ అల్లిపురం జండా చెట్టు వీధిలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి సీతారాం,32వ వార్డ్ కార్పొరేటర్ తోట పద్మా అతిథులు గా హాజరయ్యారు. వేసవి శిక్షణ శిబిరాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అంద చేశారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ పిల్లలు సర్వతో ముఖాభివృద్ధికి ఇటువంటి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు,మరిన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు ఇటువంటి చక్కని కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వార్డ్ కార్పొరేటర్ తోట పద్మావతి మాట్లాడుతూ సకల్య సంస్థ లోలోతుగా ఆలోచన చేస్తూ బాలలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఇటువంటి దీర్ఘకాలిక ప్రణాళికతో కార్యక్రమాలు రూప కల్పన చేస్తూ బాలల మనసులు గెల్చుకొనే ప్రయత్నంలో సఫల వంతం కానుండడం హర్షణీయమ న్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ మధుసూధన్,స్థానిక వార్డ్ నాయకులు లింగం శ్రీను,చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కన్వీనర్ కె.ఎల్లయ్య,సకల్య సంస్థ ప్రతినిధులు షకీల,జ్యోతిశ్రీ,విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చోడవరంలో
# 25.6 లక్షల భీమా సొమ్ము పంపిణీ

- పాడి రైతుల ఆర్థిక స్వావలంబనకు విశాఖ డైరీ కృషి
- పాడి పశువులకు సైలేజ్ గడ్డి వాడకం ద్వారా మరింత లాభదాయకం
- విశాఖ డైరీ డైరెక్టర్ పిల్లా రమాకుమారి




చోడవరం( విజయ భాను న్యూస్) : విశాఖ డైరీ లో పాలు పోస్తున్న పాడి రైతుల కు 25 లక్షల, 60 వేల, 500 రూపాయల చెక్కులను విశాఖ డైరీ బోర్డ్ డైరెక్టర్ పిల్లా రమా కుమారి చేతుల మీదగా శనివారం పంపిణీ చేశారు. 64 పశు బీమా చెక్కులు ,37 సామూహిక భీమ చెక్కులను రైతులకు అందజేశారు. చోడవరం యూనిట్ ఆఫీస్ లో జరిగిన పాడి రైతుల సామూహిక బీమా, పశు బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థిక స్వావలంబనకు విశాఖ డైరీ కృషి చేస్తుందని, రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పశువుల జీవనాధారంగా వేలాది, లక్షలాది కుటుంబాలకు అండగా ఉంటూ బాసటగా నిలుస్తుంది అన్నారు. పాడి రైతులు తమ పశువులకు సైలేజ్ గడ్డి వాడకం వల్ల మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ బోర్డు డైరెక్టర్ శ్రీ రమ్ రెడ్డి సూర్య నారాయణ, దాడి పవన్ కుమార్, ఏరియా మేనేజర్, సూపర్వైజర్లు, ఆయా గ్రామాల పాల సంఘాల అధ్యక్ష, కార్య దర్శులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద రోగులకు పండ్లు పంపిణీ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర్య హాస్పిటల్ అధినేత, మాజీ డిఎంఈ డాక్టర్ శాంతారావు నేతృత్వంలో శనివారం సూర్య హాస్పిటల్ లో నిరుపేద రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు.బూరాడ సత్యనారాయణ పుత్రుడు, సత్యవతి దంపతుల 9వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పిల్ల గీతారత్నం, ట్రస్టీ, సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బూరాడ వెంకటరమణ అధ్య క్షతన ఈ కార్యక్రమం జరి గింది. ఈ సందర్భంగా డాక్టర్ శాంతారావు మాట్లా డుతూ ట్రస్టు తరుపున పేదలకు సేవా కార్య క్రమాలు చేస్తూ అందరి మన్నులు పొందు తున్నారని తెలిపారు.

ఈ కార్య క్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కోడికేన మోహన్ రావు, న్యాయవాదులు సి పి రాజు, శ్రీనివాస్ పాత్రుడు, జయ ప్రకాష్, నావల్ కమాండింగ్ ఆఫీసర్ కె. సంజయ్ కుమార్, సిహెచ్ లక్ష్మి నీలిమ , పిల్లా రామకృష్ణ ,బీవీ ప్రసాద్, శ్రీనివాస్ ,ఎండి అర్జున్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శాంతారావు ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు.

## సత్యదేవుడ్ని దర్శించుకున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మార్షల్ బి.చంద్రశేఖర్



అన్నవరం(విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని శనివారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మార్షల్ బి.చంద్రశేఖర్ దంపతులు శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా ఆలయ అధికారులు శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ తాడి.గుర్రాజు,పెద్దింటి.తలుపులయ్య,ఆర్ై భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జగన్ భేష్



అచ్యుతాపురం (విజయభాను) : సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసారని యలమంచిలి ఎమ్ఎల్ఎ యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) అన్నారు. శనివారం ఖాజీపాలెం గ్రామంలో గడప గడపకు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. అర్హులైన వారందరికీ ఇల్లు, పెన్షన్‌లు అందజేసామన్నారు. గ్రామస్తుల్లో ఎటువంటి సందేహాలు, సమస్యలున్నా వెంటనే తన వెంట ఉన్న అధికారులను వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు ఎమ్ఎల్ఎ చేతుల మీదుగా వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మెన్ యు.సుకుమార వర్మ (తేజ), ఎమ్పిపి కోన సంధ్య లచ్చన్నాయుడు, జెడ్‌పిటిసి లాలం రాంబాబు, ఎమ్ఆర్ఒ రాంబాయి, అధిక సంఖ్యలో మండల నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### విజయ పరిమళం

జరీన్.. ఇప్పుడీ పేరు దేశమంతా మార్మోగిపోతోంది. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయఢంకా మోగించిన తెలుగు వనిత. ప్రపంచ టైటిల్ గెలిచిన ఐదో భారత బాక్సర్. నిఖత్ తొలిసారి ఆ మెగా ఈవెంట్‌లో స్వర్ణం గెలిచినా.. ఈ విజయం గురించి యావత్ భారతం ప్రత్యేకంగా చర్చించుకుంటోంది. ఆమె సాధారణ స్థాయి నుంచి ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగిన వైనం అందరినీ అబ్బురపరుస్తోంది. ఎన్నో అవరోధాలు, మరెన్నో అవమానాలు, సవాళ్లను అధిగమించి విశ్వవేదికపై త్రివర్ణపతాకాన్ని రెపరెపలాడించిన ఈ తెలంగాణ అమ్మాయి జీవితం యువ క్రీడా తరంగాలకు ఎంతో స్ఫూర్తిదాయకం.

బాక్సింగ్‌లో తలపడేందుకు అవసరమైన రింగ్ కూడా సరిగా లేని పట్టణం నుంచి వచ్చిన నిఖత్ తొలుత అథ్లెటిక్స్‌ను కెరీర్‌గా ఎంచుకుంది. కానీ, తన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడి సలహాతో పంచ్‌లు విసరడంపై మక్కువ పెంచుకుంది. బాక్సింగ్ అంటే అబ్బాయిలకేనా.. అమ్మాయిలు ఎందుకు ఆడరాదంటూ ఆ చిరుప్రాయంలోనే తండ్రిని ప్రశ్నించింది. ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉన్న ఆ మైనారిటీ కుటుంబం నిఖత్ ప్రాక్టీస్ కోసం సొంతూరిని వదిలి హైదరాబాద్ వచ్చేసింది. తమ నలుగురు కూతుళ్లలో మూడో అమ్మాయి అయిన నిఖత్ కెరీర్ కోసం ఆ తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. ముఖంపై దెబ్బలు తగిలే ఆటలు అమ్మాయిలకు అవసరమా అంటూ చాలామంది హేళన చేసినా, వాటిని పట్టించుకోకుండా కుమార్తెను ప్రోత్సహించారు. ప్రాక్టీస్ సందర్భంగా రింగ్‌లో దెబ్బలు తగిలితే ఫిజియోథెరపిస్టులైన ఆమె ఇద్దరు సోదరీమణులు చికిత్స చేసేవారు. తనకోసం అడుగడుగునా అండగా నిలిచిన కుటుంబం త్యాగానికి ప్రతిఫలంగా.. నిఖత్ పట్టుదలగా కష్టపడి అనతికాలంలోనే ప్రొఫెషనల్ బాక్సర్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. పద్నాలుగేళ్ల వయసులోనే జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి ఆనాడే సీనియర్ స్థాయిలో అతిపెద్ద విజయాన్ని అందుకునేందుకు బాటలు వేసుకుంది.

మూడేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో 52 కిలోల ఫ్లయ్‌వెయిట్ విభాగంలో పసిడి పతకంతో పాటు ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలోనే టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ తరఫున జట్టులో చోటుకోసం తన ఆరాధ్య క్రీడాకారిణి, దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌తో హక్కుల కోసం నిఖత్ పెద్ద పోరాటమే చేసింది. మేరీకోమ్ విభాగం నుంచే నిఖత్ కూడా పోటీపడాల్సి వచ్చింది. దీంతో ఎలాంటి ట్రయల్స్ లేకుండా సీనియర్ అన్న కారణంతో నేరుగా మేరీని విశ్వక్రీడల్లో ఆడించాలని జాతీయ బాక్సింగ్ సమాఖ్య ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని నిఖత్ ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం ఇద్దరికీ సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించి గెలిచిన వారికి టోక్యో ఎంట్రీ ఖరారు చేయాలని తన గొంతును వినిపించింది. కానీ తన ఆవేదనను ఎవరూ పట్టించుకోకపోవడంతో జాతీయ సమాఖ్యపై నేరుగా కేంద్ర క్రీడామంత్రికి లేఖ రూపంలో ఫిర్యాదు చేసి తెగువ చూపించింది. ఎట్టకేలకు నిఖత్ డిమాండ్‌కు తలొగ్గి ట్రయల్స్ నిర్వహిస్తే, ఆ బౌట్‌లో నిఖత్‌పై మేరీకోమ్ గెలిచింది. కానీ, ఓ జూనియర్ బాక్సర్ తన విషయంలో పోటీకి దిగడాన్ని సహించలేకపోయిన మేరీ.. బౌట్ ముగిశాక నిఖత్‌తో అమర్యాదగా ప్రవర్తించింది. నిఖత్ కరచాలనం కోసం ముందుకొచ్చినా చేయి కూడా ఇవ్వకుండా మేరీకోమ్ అక్కడి నుంచి కోపంతో వెళ్లిపోయింది. ఈ అవమానాలన్నింటినీ మౌనంగా భరించిన నిఖత్.. తన పంచ్‌తోనే అందరికీ సమాధానమివ్వాలని భావించింది. కసిగా ప్రాక్టీస్ చేసి మళ్లీ మునుపటి ఫామ్‌ను అందిపుచ్చుకుంది. వివిధ అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొని రాణించింది. ఈసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌నకు సన్నద్ధమైంది. రింగ్‌లో పోటీపడి అద్భుతమైన ప్రదర్శన కనబరచి దేశానికి వన్నె తెచ్చింది. ఏకంగా విశ్వవిజేతగా అవతరించింది. మూడేళ్ల క్రితం తన హక్కుల కోసం చేసిన పోరాటం తప్పు కాదని నిరూపించింది. ఈ అరుదైన విజయానికి నూరుశాతం అర్హురాలినని చాటి చెప్పింది. ప్రపంచ టైటిల్‌తో భారత బాక్సింగ్‌ను మరో మెట్టు పైకి తీసుకెళ్లిన నిఖత్ ఒలింపిక్ స్వర్ణ పతక కల నెరవేరాలని ఆశిద్దాం.

నిఖత్ జరీన్ విజయంతో ఇప్పుడు భారత క్రీడారంగ పురోగతిలో తెలుగు మహిళామణుల ముద్ర మరోసారి స్పష్టమైంది. టెన్నిస్‌లో సానియా మీర్జా, బ్యాడ్మింటన్‌లో సైనా, సింధు, క్రికెట్‌లో మిథాలీ రాజ్ ఎలాగైతే తమ ప్రత్యేకతను చాటుకున్నారో.. బాక్సింగ్‌లో నిఖత్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.


# సాకారం దిశగా గగనయానం.. ప్రయోగానికి ఇస్రో సిద్ధం

**గగన్‌యాన్-1 ప్రయోగంలో భాగంగా అంతరిక్షంలోకి పంపనున్న క్రూ మాడ్యూల్ (వ్యోమగాముల గది) ఊహా చిత్రం.**

**సుగమం చేసే దిశగా గగన్‌యాన్ -1 ముందస్తుగా భూస్థిర పరీక్షల నిర్వహణ**

**ఐదు ప్రయోగాత్మక ప్రయోగాలు విజయవంతం**

**మరికొన్ని ప్రయోగాలకు సిద్ధం**



సూళ్లూరుపేట: ఇస్రో గండరగండులు ఇకపై అంతరిక్షంలో విహరించనున్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మానవ సహిత ప్రయోగాలే లక్ష్యంగా ఈ ఏడాది చివరికి లేదా 2023 ప్రథమార్థంలో గగన్‌యాన్-1 ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇస్రో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేసేందుకు పలు రకాల భూస్థిర పరీక్షలు చేసి రాకెట్ సామర్థ్యాన్ని పరీక్షిస్తోంది. గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి భారత ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించడంతో ప్రాజెక్టు వేగవంతంగా ముందుకు సాగుతోంది. భవిష్యత్‌లో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు కూడా ఇస్రో సన్నద్ధమవుతోంది.

గగన్‌యాన్-1కు సంబంధించి తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్)లోని స్ర్పొబ్ విభాగంలో ఈ నెల 13న ఎస్-200 (ఘన ఇంధన మోటార్) భూస్థిర పరీక్షను ప్రయోగాత్మకంగా నిర్వహించి విజయం సాధించారు. భారీ రాకెట్ ప్రయోగానికి ఉపయోగించే ఎస్-200 స్ట్రాపాన్ బూస్టర్లు, రెండో దశలో ఉపయోగించే ఎల్-110 సామర్థ్యంతో పాటు సుమారు 3.5 టన్నుల బరువు గల క్రూ మాడ్యూల్ (వ్యోమనాట్స్ గది)ను పంపించి మళ్లీ దాన్ని తిరిగి సురక్షితంగా తీసుకొచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇస్రో సొంతంగా తయారు చేసుకుంది. క్రూ మాడ్యూల్‌ను విజయవంతంగా ప్రయోగించి పారాచూట్‌ల సాయంతో తిరిగి తీసుకొచ్చే విషయంలోనూ విజయం సాధించారు.

**దిగ్విజయంగా.. ప్యాడ్ అబార్ట్ టెస్ట్..**

మానవ సహిత ప్రయోగాల్లో ప్రాణ నష్టాన్ని నివారించేందుకు 2018 జూలై 4న 'ప్యాడ్ అబార్ట్ టెస్ట్' అనే ప్రయోగాత్మక ప్రయోగాన్ని కూడా విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రయోగంలో 259 సెకన్ల పాటు రాకెట్‌ను నాలుగు దశల్లో మండించి రెండు కిలోమీటర్ల మేర అంతరిక్షం వైపునకు తీసుకెళ్లి పారాచూట్‌ల ద్వారా క్రూ మాడ్యూల్‌ను బంగాళాఖాతంలోకి దించారు. అక్కడ రెండు చిన్నపాటి పడవల్లో ఇస్రో శాస్త్రవేత్తలు దానిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

**720 సెకన్లపాటు మండించి..**

గగన్‌యాన్-1 ప్రయోగానికి సంబంధించి జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్‌లో మూడో దశలో ఉపయోగించే క్రయోజనిక్ దశను తమిళనాడులోని ఇస్రో ప్రొపల్షన్ సెంటర్‌లో ఈ ఏడాది జనవరి 12న భూస్థిర పరీక్ష నిర్వహించి దాని సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు. క్రయోజనిక్ మోటార్‌లో 12 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని నింపి 720 సెకన్ల పాటు మండించి ఇంజన్ పనితీరును పరీక్షించారు. ఈ ఇంజన్‌ను మరోమారు 1,810 సెకన్ల పాటు మండించి పరీక్షించేందుకుగాను మరో నాలుగు పరీక్షలను నిర్వహించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది.

**ఆర్‌ఎల్‌వీ టీడీ ప్రయోగమూ విజయవంతం**

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి 2016 మే 23న రీయూజబుల్ లాంచింగ్ వెహికల్-టెక్నికల్ డిమాన్‌స్ట్రేటర్ (ఆర్‌ఎల్‌వీ-టీడీ)ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ తరహా రాకెట్ 12 టన్నుల బరువుతో పయనమై 56 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లాక శిఖర భాగాన అమర్చిన 550 కిలోల బరువుగల హైపర్ సోనిక్ ఫ్లైట్‌ను విడుదల చేసింది. ఆ ఫ్లైట్ 65 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లి తిరిగి వచ్చేందుకు రన్ వే సౌకర్యం లేకపోవడంతో ప్రయోగాత్మకంగా శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి 450 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో దిగ్విజయంగా దించారు.

దానికి ఇండియన్ కోస్టల్ గార్డ్స్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ వారు సముద్రం మీద విండ్ మెజర్‌మెంట్, షిప్ బర్న్ టెలీమెట్రీ సౌకర్యాన్ని అందించి ఇస్రోకు సహకరించడంతో ఈ ప్రయోగాన్ని విజయవంతంగా చేయగలిగారు. వ్యోమనాట్స్‌ను రోదసిలో వదిలిపెట్టి మళ్లీ క్షేమంగా తెచ్చేందుకు ఉపయోగపడే రీయూజబుల్ లాంచింగ్ వెహికల్-టెక్నికల్ డిమాన్‌స్ట్రేటర్ (ఆర్‌ఎల్‌వీ-టీడీ) ప్రయోగాన్ని ప్రయోగాత్మకంగా చేసి నిర్ధారించుకున్నారు.

## కవిసమయం

### సర్వేశ్వరుడు

ప్రభూ ! సర్వాంతర్యామి, ఈశా,
మహేశా
దీనజనోద్ధారకుడా, దయా సముద్రుడా
అడగకనే అన్నీ ఇచ్చావు
ప్రార్థన, ఆరాధన పేరుతో
కోరికల చిట్టానూ ముందు విప్పు
తున్నా
ప్రతీ క్షణం ఏదో ఒకటి నీ నుండి
ఆశిస్తున్నా
పెద్ద మనస్సుతో మమ్మల్ని క్షమిస్తునే
వున్నావు
నీ బోధలను ఒక్కటి కూడా
ఆచరించకున్నా
మమ్మల్ని కష్ట నష్టాల నుండి రక్షిస్తునే
వున్నావు
జగత్తుకే తండ్రివైన నిన్ను
విస్మరిస్తున్నా
బిడ్డలమైన మమ్మల్ని
కాపాడుతున్నావు
ఎల్లవేళలా నీ అభయ రక్షా కవచం
మాకందించి మమ్మల్ని ఒడ్డున
పడేస్తున్నా
కనీసం కృతజ్ఞత కూడా
పవిత్రమైన మనస్సుతో చెప్పని
కృతఘ్నులం మేము
కష్టాలలోనే గుర్తుంచుకునే పెద్ద
మనసూ మాది
మమ్మల్ని క్షమించి మాలో
జ్ఞానోదయం కలిగించి
సన్మార్గులను గావించు తండ్రీ

... రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : వైవాఖ; తిథి :సప్తమి సా.6.02; ధనిష్ట తె.3.39; ఉ.వ.8.38ల 10.10

ఆదివారం 22-05-2022

a **మేషం** : ప్రముఖుల సహాయంతో ఒక సమస్య నుంచి క్షేమంగా బయట పడతారు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. b **వృషభం** :పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల చోటు చేసుకుంటాయి. c **మిథునం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయాసలు ఎదుర్కొంటారు. స్త్రీలకు బంధువుల వైఖరి నిరుత్సాహం కలిగిస్తుంది. అవివాహితులు శుభవార్తలు అందుకుంటారు. బంధువులతో మనస్పర్థలు తలెత్తుతాయి. d **కర్కాటకం** : వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. మిత్రుల సహకారంతో కొత్త యత్నాలు మొదలెడతారు. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగస్తులు పై అధికారులను మెప్పిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అనుకూలిస్తాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి నిరుత్సాహం తప్పదు. e **సింహం** :నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం. వేడుకలు, శుభకార్యాల్లో అందరినీ ఆకట్టుకుంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. f **కన్య** :ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఎదురు చూడకుండానే మీకు కొత్త అవకాశాలు లభిస్తాయి. g **తుల** : ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కాదని గమనించండి. వస్త్ర, ఫ్యాన్సీ, మందులు, రసాయన సుగంధ ద్రవ్య వ్యాపారులకు పురోభివృద్ధి. కోర్టు వ్యవహారాలలో ప్లీడరు, ప్లీడరు గుమస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు అధికమవుతాయి. h **వృశ్చికం** :ఆలయాలను సందర్శిస్తారు. బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేయు కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. **ధనుస్సు** :వ్యాపారాల విస్తరణలు, పరిశ్రమల స్థాపనలకు కావలసిన అనుమతులు మంజూరు కాగలవు. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులతో సంప్రదింపుల ు జరుపుతారు. గృహంలో ఒక శుభకార్యానికి అనువైన పరిస్థితులు నెలకొంటాయి. మీ విలువైన వస్తువులు, పత్రాల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. j **మకరం** :స్త్రీలకు బంధువుల రాక వల్ల ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి. పత్రిక, ప్రైవేటు సంస్థల్లోని వారికి యాజమాన్యం తీరు ఆందోళన కలిగిస్తుంది. చేతివృత్తులు, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. గృహ నిర్మాణాలు, మరమ్మతులు అనుకూలిస్తాయి. k **కుంభం** :తలచిన పనుల్లో జయం లాంటి శుభ సూచకాలున్నాయి. ఎంత ధనం వెచ్చించినా కోరుకున్న వస్తువు దక్కించుకుంటారు. స్త్రీలకు నూతన పరిచయాలు, చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. ఒక వ్యవహారం అనుకోకుండా మీకు అనుకూలిస్తుంది. L **మీనం** :ఆడిటర్లు, అకౌంట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికం. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో లౌక్యం అవసరం. నూతన పెట్టుబడులు, లీజు, ఏజెన్సీలు లాభిస్తాయి.

# నర్మదా, సోన్ నదుల జన్మస్థలం అమర్‌కంటక్



## సంకీర్తన

మధ్య ప్రదేశ్ రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తున్న పవిత్ర జీవ నది నర్మదా. నర్మదాతో పాటుగా సోన్ నదుల జన్మస్థలం అమర్‌కంటక్. ఉత్తర భారతాన్ని దక్షిణాది విడగొడుతున్న పర్వత సానువైన వింధ్యలోని ప్రాంతం అమర్‌కంటక్. హిందువులు పవిత్ర క్షేత్రంగా పేర్కొనే దానిలో అమర్‌కంటక్ ఒకటి. అన్ని నదులు కంటే భిన్నంగా తూర్పు నుంచి పడమరకు ప్రవహించే అతిపెద్ద నదుల్లో ఒకటి నర్మదా. ఇక్కడే ఉద్భవించిన సోన్ నది మాత్రం తూర్పు ముఖంగా ప్రవహిస్తుంది. అడవుల మధ్య ఉన్న ప్రాంతం కావడంతో పచ్చదనంతో కళకళలాడుతుంది అమర్‌కంటక్. మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల మీదగా 1,312 కి.మీ. మేర ప్రవహించి అరేబియా సముద్రంలో సంగమిస్తుంది. నర్మదా సంగమ ప్రాంతం గుజరాత్‌లోని భారూచ్‌కు 50 కి.మీ. దూరంలో ఉంది. మనదేశంలో ఐదో అతిపెద్ద నది నర్మదా. దేశంలోని అన్ని నదులు తూర్పు వైపుకు ప్రవహిస్తుంటే నర్మదా, తపతి, మాహిలు మాత్రం పడమర దిశగా ముందుకు సాగుతాయి. నర్మదా నది వల్ల ఎక్కువ లబ్ది పొందేది మధ్య ప్రదేశ్. నర్మదకు 41 ఉపనదులు ఉన్నాయి. సాత్పూరా పర్వత శ్రేణిలో జన్మించినవి 22 నదులు కాగా, మిగిలిన 19 నదులు వింధ్య లోవి. భారతదేశం లోని పవిత్ర పంచ జీవ నదుల్లో నర్మద ఒకటి. మిగిలినవి గంగా, యమునా, గోదావరి, కావేరి. విష్ణు పాదోద్భవి అయిన పవిత్ర గంగానదిలో ప్రతి ఏడాది కోట్లాది జీవరాశులు స్నానం చేయటంవల్ల అపరిశుభ్రం అవుతుంది. గంగా మాత తిరిగి పవిత్రంగా మారాలంటే నర్మదలో స్నానం చేయమని పరమ శివుడు ఆమెను ఆదేశించాడు. నర్మదా నది పవిత్రత, ప్రాముఖ్యత గురించి రామాయణం, మహాభారతాలతో పాటుగా వాయు, స్కంధ పురాణాల్లో వివరించారు.

**ప్రముఖ పుణ్యక్షేత్రాలు**

**అమర్‌కంటక్**

నర్మదా నది జన్మించిన ప్రాంతం అమర్‌కంటక్. వింధ్యా-సాత్పూరా పర్వత శ్రేణులను కలిపే మైకాల్ పర్వతాల్లోని ప్రాంతం అమర్‌కంటక్. ఈ ప్రాంతం సముద్రమట్టానికి 1067 మీటర్లు ఎత్తున ఉంది. ఇక్కడ ఉన్నటువంటి నర్మదా నది దేవాలయాన్ని నాగపూర్ భోన్స్‌లే రాజులు నిర్మించారు. బాఘేల్, కల్చురీ వంశ రాజులు అమర్‌కంటక్‌లో అనేక దేవాలయాలు నిర్మించారు.

**ఓంకారేశ్వర్**

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటి ఓంకారేశ్వర్. ఇక్కడ వెలసిన శివుడు పేరు ఓంకారేశ్వరుడు.

**మహేశ్వర్**

దక్షిణ అవంతి రాజ్య పరిధిలోని ప్రాంతం మహిషసతి. మహాభారతం, రామాయణంలలో దీని గురించి ప్రస్తావన ఉంది. ఇక్కడి దేవుడి పేరు మహేశ్వరుడు. మహిషసతిని ప్రస్తుతం మహేశ్వర్‌గా పిలుస్తున్నారు.

**ఎలా చేరుకోవాలి**

విమాన మార్గం : జబల్‌పూర్ (228 కి.మీ.), రాయ్‌పూర్ (230 కి.మీ.) సమీపంలోని విమానాశ్రయాలు.

రైలు మార్గం : పెండ్రా రోడ్ సమీపంలోని రైల్వే స్టేషన్. అమర్‌కంటక్ నుంచి 42 కి.మీ. దూరంలో ఉంది పెండ్రా రోడ్. కత్ని-బిలాస్‌పూర్ మార్గంలో ఉంది పెండ్రా రైల్వే స్టేషన్.

రహదారి మార్గం : జబల్‌పూర్ (228 కి.మీ.), రాయ్‌పూర్ (230 కి.మీ).

# యాచకులికి భోజనం వితరణ



సింహాచలం (విజయభాను న్యూస్) : గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లోగిశ గణేష్ పెళ్లి రోజు సందర్భంగా సుమారు 50 మంది యాచకులకి సింహాచలం కొండ దిగువన పంపిణీ చేశారు. మీరుకూడా పుట్టిన రోజు లకి,పెళ్లి రోజునలకి, ఇతర వార్షికోత్స వాలు ఇతర కార్యక్రమాలకు మీ వంతు గా వారి కి సాయం చెయ్యాలని లోగిశ గణేష్,సంతోషి దంపతులు కోరారు.

# ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు

## అనకాపల్లి జిల్లా ఏపీ పాస్టర్ల ఫెడరేషన్



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా లోని పాస్టర్లు నాయకులు థాంక్యూ సియమ్ సార్ అనే కార్య క్రమము చేపట్టారు.

ఈ సందర్భంగా ..

వీరంతా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ తీర్మానం చేసిన నకలు ధ్రువపత్రాన్ని జిల్లా కలెక్టర్ పి.రవి సుభాష్ కు అందజేశారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ గౌతమి శాలి ని గౌరవపూర్వకంగా కలిసి మరొక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో...

రెవ యమ్ ఉదయ కుమార్ (జిల్లా ఉపాధ్యక్షులు) రెవ . జి.అనిల్ కుమార్ (జిల్లా కార్యదర్శి) రెవ . జె . ప్రేమ్ కుమార్ ం (జిల్లా కోశాదికారి) రెవ. మోజస్ (జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్)పాస్టర్ . వి . ప్రవీణ్ నోబెల్ (జిల్లా మిషన్ కో ఆర్డినేటర్) మరియు అనకాపల్లి జిల్లా మండల ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు..

# రాష్ట్ర వైసీపీ ప్రభుత్వ పాలన నచ్చక 200 కుటుంబాలు

## మాజీ మంత్రి కీడారి శ్రావణ్ కుమార్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ కార్యకర్తలు




అల్లూరి సీతారామరాజు జిల్లా.(విజయభాను) డుంబ్రి గూడ మండలం కిత లంగి పంచాయితి రంగిసింగి గూడ గ్రామానికి చెందిన వైసిపి పార్టీ నాయకులు, కార్య కర్తలు మహిళలు సుమారుగా 200 వందల కుటుంబాలు అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ సమక్షంలో తెలుగు దేశం పార్టీలో కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి అవహనించడం జరిగింది అంతకు ముందు గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కి పూలమాల వేసి నుద్దుట తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు .అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్టంలో వైసిపి ప్రభుత్వం చేసిందేమి లేదని గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఎక్కడ జరగటం లేదని అదే విధంగా రంగిసింగిగూడ లో రోడ్డు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని కనీసం సి సి రోడ్డు వేయలేని దుస్థితిలో రాష్ట్ర వైసిపి ప్రభుత్వం ఉందని రాష్ట్ర ప్రభుత్వ మూడు సంవత్సరాల పాలనలో విసుగు చెంది వైసిపి నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు.

అదే విధంగా విద్యుత్ ఛార్జీలు బస్సు ఛార్జీలు నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్య ప్రజలకు బ్రతకడానికి భారంగా మారిందని రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు,అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కమిడి సుబ్బారావు,మండల ఉపాధ్యక్షులు బోయిన పోతి,మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ భాస్కరరావు,దారేల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి,మండల టీడీపీ యువ నాయకులు గొల్లోరి ప్రసాద్, రూడి త్రినాథ్, బోంజుబాబు,గురు, కిలో రామ మూర్తి,వంతల కొండ, వార్డు మెంబర్లు శెట్టి రమేష్,బల్లిబాబు,టీడిపి నాయకులు కార్యకర్తలు ధర్మ,కొర్ర బొంజూబాబు, మత్స్య రాజు,గోవింద్,సింహాద్రి, ప్రహలధ్,మురళి,రమేష్, అగతంబిడి ఆనంద్,శెట్టి గోపాలా కృష్ణ,మురళి ప్రసాద్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు సమ్మర్‌లో ఉచితంగా కళా నైపుణ్యాలు

అచ్యుతాపురం (విజయభాను) : మోసయ్యపేట గ్రామంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వారిచే ఉఛితంగా విధ్యార్థులకు ఆట పోటీలు పలు కళా నైపుణ్యాలలో ప్రావిణ్యం కల్పిస్తున్నట్లు సర్పంచ్ పంచదార్ల పైడి రాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మోసయ్యపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. ఐద్వా మండల కార్యదర్శి రొంగలి లక్ష్మి మాట్లాడుతూ వారం రోజుల పాటు విధ్యార్థులందరికీ చిత్ర లేఖలు, దేశభక్తి గీతాలు, డాన్స్, యోగా, కథలు ఆట పోటీలు నేర్పడం జరుగతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విధ్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొమ్మోజు ఈశ్వర్రావు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కూండ్రపు సోమునాయుడు, ఆర్.భువన, మల్లిక, నూకరత్నం, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



# వైకాపా ఏమి ఉద్ధరించారని బస్సు యాత్ర చేస్తారు?

**- రెండేళ్లలో 18,226 కోట్ల కార్పొరేషన్ నిధులు మళ్లించి కార్పొరేషన్లు ఫెడరేషన్ నిర్వీర్యం చేశారు**

**- ప్రజలు మిమ్మల్ని తరిమి తరిమి కొడతారు - నగర టీడీపీ బీసీ సెల్ నాయకులు**



విశాఖపట్నం(విజయభాను న్యూస్): రాష్టంలో వైకాపా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ఏమి ఉద్ధరించాలని బస్సు యాత్ర చేపడుతున్నారని

తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్, ప్రధాన కార్యదర్శి అనసూరి మధు మరియు రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రాజమండ్రి నారాయణ వైకాపా నాయకులను ప్రశ్నించారు. శనివారం స్థానిక

జిల్లా పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్, ప్రధాన కార్యదర్శి అనసూరి మధు మరియు రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రాజమండ్రి నారాయణ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్ మాట్లాడుతూ బీసీలను ఉద్ధరించేసాం బడుగు బలహీన వర్గాలకు వేలకోట్లు పంచేసాం అంటూ జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతూ ప్రజలను మభ్య పెడుతుందని, కానీ బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసేలా రెండేళ్లలో 18226 కోట్లు మళ్ళించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు సైతం ఇతర అవసరాలకు వాడేశారని, ఫెడరేషన్ లు అన్న మాటే లేకుండా చేశారని సబ్ ప్లాన్ ప్రస్తావన కూడా లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఇలా మాయ మాటలు చెబుతూ బీసీలకు దొంగ దెబ్బతీస్తున్నారని,

టిడిపి హయాంలో కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా లక్షలాది మంది లబ్ధిపొందారని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని వ్యాపారస్థులకు ఎదిగి ఆర్థికంగా బలపడాలని. ఇప్పుడు కార్పొరేషన్ నిధుల అన్నిటినీ జగన్ రెడ్డి ప్రభుత్వంలో నిధులు అన్నిటిని మళ్ళించేశారని, కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, ఇదేనా బీసీలను ఉద్ధరించడమంటే.

ఏ ముఖం పెట్టుకుని బస్సు యాత్ర చేస్తారని, ప్రజలు మిమ్మల్ని తరిమితరిమి కొడతారని హెచ్చరిక చేశారు.

బిసి సెల్ ప్రధాన కార్యదర్శి అనసూరి మధు మాట్లాడుతూ

చేతులు వృత్తుల వారికి సాయం ఏది? మత్స్యకారులకు సబ్సిడీపై అందాల్సిన పడవలు వలలు ఇతర పరికరాలు ఏవి? చేనేతలకు సబ్సిడీపై అందవలసిన నూలు రంగులు సహా ఇతర వస్తువుల పై సబ్సిడీలు లేవు, రజకులకు సబ్సిడీపై అందవలసిన పరికరాలు ఉచితంగా ఏర్పాటు అవ్వవలసిన భవనాలు లేవు, నాయి బ్రాహ్మణులకు సబ్సిడీపై ఇచ్చే కార్పొరేషన్ ఫెడరేషన్ రుణాలు లేవు, 90 శాతం సబ్సిడీతో అందించిన ఆదరణ పథకాన్ని భ్రష్టు పట్టించారు. పరికరాలను తుప్పుపట్టాయి తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో 139 కులాల వారి వారి వృత్తులకు అనుగుణంగా పరికరాలు ఇచ్చాము. రెండేళ్లు జగన్ రెడ్డి పాలన మొత్తం చిల్లర విధిలించడం తప్ప చేసిందేమీ లేదు, నాలుగు కులాలకు ఏవో పథకాలు ఇచ్చి బీసీలందరిని ఉద్ధరించినట్లు ప్రచారం చేసుకుంటున్నారు, 56 కార్పొరేషన్ ఏర్పాటు చేశామని ప్రచారం చేసుకోవడం తప్ప ఏ కార్పొరేషన్ కు కూడా రూపాయి బడ్జెట్ కేటాయించలేదు కనీసం చైర్మన్లు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేని పరిస్థితి కల్పించారు, తెలుగుదేశం ప్రభుత్వం హయంలో ప్రతి కార్పొరేషన్ కి బడ్జెట్ కేటాయించి ఆయా కార్పొరేషన్ పరిధిలోని అర్హులకు రుణాలు ఇప్పించి స్వయం ఉపాధికి స్వయం ఉపాధి భరోసా కల్పించాం. బీసీలపై అంత ప్రేమ చూపిస్తున్న జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడుసార్లు పెట్టారు కానీ ఏ బడ్జెట్ లో కూడా కార్పొరేషన్ రూపాయి కూడా ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు.

రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రాజమండ్రి నారాయణ మాట్లాడుతూ బీసీలు 139 కులాలు ఉంటే ఐదు కులాలకు మాత్రమే పది వేల రూపాయల చొప్పున కొంతమందికి మాత్రమే ఇచ్చి చేయి దులుపుకుని బీసీలను ఉద్ధరించేసామంటారా? గత

తెలుగుదేశం ప్రభుత్వంలో ఫెడరేషన్ లను ఆర్థిక కార్పొరేషన్లు గా ఏర్పాటు చేస్తే ఈ ప్రభుత్వం వచ్చి అభివృద్ధి కార్పొరేషన్ గా మార్చడం ఎంతవరకు సమంజసం?. మీరు బీసీలకు చేసిన దేంటి అని ప్రశ్నించారు.

# అక్రమ కాల్సైట్ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

## ధీసరి గంగరాజు జెడ్పీటీసీ అనంతగిరి

అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ నిమ్మలపాడు, తూభుర్తి, కరకవలస, రాళ్ళవలస గ్రామాల పరిధిలో జరుగుతున్న అక్రమ కాల్సైట్ మైనింగ్ రద్దు చెయ్యాలని గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అనంతగిరి జడ్పీటీసీ దీసరి.గంగరాజు శుక్రవారం అల్లూరిసీతా రామరాజు జిల్లా (పాడేరు) ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ శ్రీ సుమీత్ కుమార్ గారికి, ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ కి రైతులు గ్రామస్తులతో కలసి పిర్యాదు చేయడం జరిగింది.గత 10 సంవత్సరాల నుండి మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయి నేటికీ ఒక్క రూపాయి కూడా పంచాయతీ రాయల్టీ చెల్లించలేదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగాలు లేవు భూమి పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు.అన్ని అక్రమంగా దౌర్జన్యంగా తరలిస్తున్నారు గిరిజన చట్టాలను ఉల్లంఘించి మైనింగ్ తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడం జరిగింది ఈకార్యక్రమంలో సంపి.వెంకట రావు, వెంకటస్వామి, ప్రజలు పాల్గొన్నారు.

## సాయి ప్రియా లే-అవుట్‌లో

# గుర్తు తెలియని మృతదేహం




అచ్యుతాపురం( విజయభాను) : మండల కేంద్రమైన అచ్యుతా పురం సాయి ప్రియా లే-అవుట్‌లో గుర్తు తెలియని మగ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. మృతునిపై ఒంటిపై నీలి రంగు లోయర్ ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని యొక్క వివ రాలు తెలి యాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# 27న బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాఖపట్నం(విజయభాను న్యూస్): మే 27 నుండి 29వ తేదీ వరకు మూడు రోజుల పాటు విశాఖపట్నం కేంద్రంగా ఆదివాసి జాతీయ సమావేశాలు జరగబోతున్నాయి.ఈ సమావేశాలకు 14 రాష్ట్రాల నుండి 80 గిరిజన సంఘంల మేధావులు విద్యార్థి, యువజన మహిళ ఉద్యమకారులు సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొనబోతున్నారు. ఈ సమావేశాలలో జీవో నెంబర్ 3 చట్టబద్ధం చేయాలని ఆదివాసి మాతృభాష విద్యావలంటీర్లను రెన్యువల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని , అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ, పీసా చట్టాల సవరణలను మానుకొని రాజ్యాంగ బద్ధంగా ఆదివాసీలకు కల్పించబడిన చట్టాలను అమలు చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అలాగే గిరిజన గ్రామాల్లో మంచి నీరు రోడ్డు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సుదీర్ఘమైన చర్చలు నిర్వహించి భవిష్యత్ ఉద్యమాలకు కార్యాచరణ రూపుదిద్దు కుంటుందని ఇటు వంటి ప్రాముఖ్యత కలిగిన సమావేశాలను ప్రతి ఒక్క ఆదివాసి సోదరీ, సోదరులు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని 27 వ తారీఖున పాడేరు కేంద్రంగా జరగబోయే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ పృథ్వి రాజు విజ్ఞప్తి చేశారు.

# దళిత యువకుడు సుబ్రమణ్యంది ముమ్మాటికీ హత్యే

## - విశాఖ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి గోవిందు



విశాఖపట్నం (విజయభాను న్యూస్): విశాఖ పార్లమెంట్ ఎస్సి సెల్ అధ్యక్షులు బుడుమూరు గోవింద్ మాట్లాడుతూ కాకినాడ లో ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్ గా పని చేస్తున్న దళిత యువకుడు సుబ్రహ్మణ్యం ను వేధిస్తున్న కారణంచేత పని మానేసాడు. అతని అనేకరకాలుగా వేధించి, డబ్బులు ఇవ్వాలి అని చెప్పి మొన్న రాత్రి 9 గంటలకు ఎమ్మెల్సీ ఆనంత బాబు తన అనుచరుని పంపించి చీకటి ప్రదేశానికి తీసుకువెళ్లి చిత్రహింసలు చేసి హత్య చేసి ఇంటికి తీసుకెళ్ళే వాడు తల్లిదండ్రులకి రోడ్డు ప్రమాదం జరిగింది అని చెప్పి వెంటనే ఆ అంత్యక్రియలు చేయాలని తొందర పెట్టడంతో తల్లిదండ్రులు నిరాకరించి నిజానిజాలు తేలాలి చెప్పి అతని భార్య వారి తల్లిదండ్రులు అతనిని వ్యతిరేకిస్తే కారుని శవాన్ని అక్కడే వదిలేసి పారి పోవడం జరిగింది.

దీనికి కారణం అంతా ఇతను ఇంతకుముందు చేసిన రహస్యాలు అసంఘిక కార్యక్రమాలు కి ఈ డ్రైవర్ సాక్షి కాబట్టి ఇతని అంతమందిస్తే ఇక్కడితో ఈ సమస్య పరిష్కారం అయిపోతుందని దురుద్దేశంతో ఈ దళితున్ని హత్య చేయించాడు. తక్షణమే ఈ హత్యకు కారకులైన వారిని దోషులను శిక్షించాలి. బాధిత కుటుంబంకు న్యాయం చేయాలి, ఆదుకోవాలి, వాళ్ళు నివసించడానికి ఇల్లు ఇవ్వాలి, ఆర్థికంగా ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ తరపున డిమాండ్ చేస్తున్నాము. అంతేకాకుండా అచ్చే ఏవిధంగా జరిగిందో వెంటనే సీఐడి కి అప్పచెప్పి దోషులను శిక్షించాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

సుబ్రహ్మణ్యం మృతదేహానికి నివాళులు అర్పించటానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు యం.యస్.రాజుపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తున్నాం

- పోలీసులు రక్షణ కల్పించాల్సింది బాధితులకా లేక బాధ్యులకా

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులమీద దాడులు , దౌర్జన్యాలు , హత్యలు , అత్యాచారాలు మరియు శిరోముండనాలు చేయడం పరిపాటిగా మారిందని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బుడుమూరి గోవింద్ విరుచుకుపడ్డారు.

ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి పసర్లపూడి జయరాజు మాట్లాడుతూ....

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌడీలు , గుండాలుగా తయారయ్యారని అటువంటి వారికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశ్రయం కల్పిస్తున్నారని ఆరోపణ చేశారు. ఎమ్మెల్సీ అనంత విజయభాస్కర్ పై హత్య మరియు ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని అలాగే బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని , సుబ్రహ్మణ్యం హత్యపై ఎస్సీ కమిషన్ విచారణ జరిపి బాధ్యులపై కఠినంగా వ్యవహరించాలని, బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాల న్యాయం చేయాలని విశాఖ పార్లమెంట్ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి పసర్లపూడి జయరాజు డిమాండ్ చేశారు. దళితులమీద జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తే రానున్న రోజుల్లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాజకీయంగా సమాధి కడతామన్నారు. సుబ్రహ్మణ్యంకు యాక్సిడెంట్ అయి చనిపోతే ఎందుకు పోలీసులకు సమాచారం ఇవ్వలేదో , ఎందుకు 108కి ఫోన్ చేయలేదో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్సీ విజయ భాస్కర్ ఉందన్నారు. ఎమ్మెల్సీ అనంత విజయ్ భాస్కర్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేసేటటువంటి రహస్యాలు, అడ్డగోలు వ్యవహారాలన్నీ ఎక్కడ బయటపడతాయోనని అభద్రతా భావానికిలోనై కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్యచేసి వారి తల్లిదండ్రులను బెదిరించడం మంచి పద్ధతి కాదని ఈ విషయమై పోలీసులు ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని కోరారు. మృతదేహానికి పరామర్శించి సుబ్రహ్మణ్యం మృతికి గల కారణాలను తెలుసుకోవడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కింజారపు అచ్చెన్నాయుడు సూచన మేరకు కాకినాడ వెళ్లిన తెలుగుదేశం పార్టీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు యం.యస్ రాజుపై పోలీసులు ప్రవర్తించిన తీరు దుర్మార్గంగా ఉందన్నారు.

పోలీసులు కొంతమంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని ఆవిధానాన్ని తప్పుపట్టారు. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు బాధ్యులకు కొమ్ముకాస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులపై దాడిచేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని అలాగే యం.యస్.రాజుకు ఏమైనా జరిగితే రాష్ట్రం అట్టుడికి పోతుందని దానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. యం.యస్. రాజుపై జరిగిన సంఘటనకు పోలీసులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# 1/70, పీసా చట్టాలను గౌరవించాలి

## అనంతగిరి జెడ్పీటీసి ధీసరి గంగరాజు

అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలం వాలాసి పంచాయతీ నిమ్మలపాడు, తూభుర్తి, కరకవలస, రాళ్ళవలస గ్రామాల పరిధిలో జరుగుతున్న అక్రమ కాల్సైట్ మైనింగ్ రద్దు చెయ్యాలని గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తూ 1/70చట్టం పీసా చట్టాలను ఉల్లంఘించి గ్రామ, పంచాయతీ సభలను దిక్కరించి 5 వ షెడ్యూల్ ఏరియాలో అక్రమంగా మైనింగ్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అనంతగిరి జడ్పీటీసీ దీసరి.గంగరాజు శుక్రవారం అల్లూరిసీతారామరాజు జిల్లా (పాడేరు) ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ శ్రీ సుమీత్ కుమార్ గారికి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిరోణంకి.గోపాలకృష్ణకి రైతులు గ్రామస్తులతో కలసి పిర్యాదు చేయడం జరిగిందివాలాసి పంచాయతీ కరకవలస, రాళ్ళవలస,తూభుర్తి గ్రామాల్లో స్థానికేతరులకు దురియ. రుక్మిణీ పేరున 22 ఎకరాలు రొబ్బ.శంఖర్ పేరున 64 ఎకరాలు ఏపిఎండిసి అనుమతులు మంజూరు చేశారు

ఎపిఎండిసీ సంస్థ గిరిజనులతో సంప్రదింపులు జరిపి 1997సమత జడ్జిమెంట్ ప్రకారం గిరిజనుల చట్టాలకు లోబడి గిరిజన సొసైటీల ద్వారా భూములు పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తు భూమికి భూమి ఇవ్వాలని స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించాలని అవకాశాలు పంచాయతీకి రాయల్టీ కట్టాలని ,ఇల్లులు పోయిన వారికి ఇల్లులు కట్టించి ఇవ్వాలని,గ్రామాల్లో మంచి నీటి,సి.సి రోడ్లు,ఆసుపత్రులు నిర్మించి వైద్యం అందించాలని జడ్జి మెంట్ చెబుతోంది.ప్రభుత్వం కూడా గిరిజనేతర సంస్థగా జడ్జి మెంట్ పేర్కొంది. గిరిజనులకు అన్యాయం చేస్తూ తీయడానికి ప్రయత్నం చేస్తున్న మైనింగ్ ఆపాలని డిమాండ్ చెయడం జరిగిందిగత 10 సంవత్సరాల నుండి మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయి నేటికీ ఒక్క రూపాయి కూడా పంచాయతీ రాయల్టీ చెల్లించలేదు, స్థానికులకు ఉపాధి, ఉద్యోగాలు లేవు భూమి పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు.అన్ని అక్రమంగా దౌర్జన్యంగా తరలస్తున్నారు గిరిజన చట్టాలను ఉల్లంఘించి మైనింగ్ తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడం జరిగింది ఈ కార్యక్రమంలో, చొంపి. వెంకటరావు,సాంబే. వెంకటస్వామి, సాంబే.రామన్న చొంపి.కోటేశ్వరరావు, సాంబే.రామూర్తి,సాంబే.నర్సింగరావు, శిల్ప. నర్సింగరావు, కేరంగి. గోపాలరావు ప్రజలు పాల్గొన్నారు.



42 వార్డు లో శనివారం దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త గండి బాబ్జీ ఆదేశానుసారం తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అక్కి రెడ్డి జగదీష్ 42 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కన్నం వెంకట రమణ రావు 42 వార్డు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ముఖి రామకృష్ణ తెలుగు యువత అధ్యక్షులు బంగారం నవీన్ 42 వార్డు తెలుగు మహిళా ప్రధానకార్యదర్శి గట్టు సీత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా

# ఆరవ రోజుపాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్షి

అల్లూరిజిల్లా. (విజయభాను) జి.మాడుగుల-1 గ్రామ సచివాలయ పరిధిలో జోగులపుట్టు, బూసిపల్లి, జి. ఎమ్.కొత్తూరు, వైబి గొందూరు గ్రామాలలో పర్యటించి అక్కడి ప్రజలతో ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వ పథకాలలో లబ్ధిదారులకు అందిన మొత్తాల వివరాలు తెలియజేశారు.



ప్రభుత్వ పథకాలు వారికి సాయపడిన విధానం వరియు ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన మొత్తానికి ప్రజలు ఆ సొమ్మును ఏయే అవసరాల కోసం వినియోగించారో తెలుసుకున్నారు. ఇదే సందర్భంలో ప్రజలకు ఉన్న సమస్యలు తెలుసుకుని అధికారులను పరిష్కరించవలసిందిగా ఆదేశించారు. ఈ పరిశీలనలో ముఖ్యంగా వెబ్ లాండ్ లో సమస్య కారణంగా రైతు భరోసా పొందకపోవడం, బూసిపల్లి నుండి ఉరుము వరకునాలుగు కిలోమీటర్లు రహదారి కావాలని, బూసిపల్లి, వైబి గొందూరులలో త్రాగునీటి సమస్య ఉన్నదని గౌరవ శాసనసభ్యులు శ్రీమతి కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి గారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి.టి.సి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ , మార్కెట్ కమిటీ చైర్మన్ గాయత్రి, పిఎసిఎస్ చైర్మన్ మత్స్యకొండం నాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబురావు, అధ్యక్షులు రామకృష్ణ, ఎంపీటీసీ గబ్బడి సన్యాసి దొర, సర్పంచ్ రాంబాబు, వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయిలో వివిధ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# దళిత కుటుంబ ని న్యాయం చేయాలని ధర్నా, రాస్తారోకో



అల్లూరి జిల్లా. విజయభాను. పాడేరు. కాకినాడ జిల్లా జిజిహెచ్ హాస్పటల్ మరియు సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల మొన్న జరిగిన వైసీపీ ఎమ్మెల్సీ ఆనంతబాబు(ఉదయ్ భాస్కర్) దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు అరెస్టు చేయాలని ఆయన పై ఎస్సీ, ఎస్టీ. ఎట్రాసిట్ కేసు పెట్టాలని హత్య చేయబడ దళిత కుటుంబ ని న్యాయం చేయాలని ధర్నా, రాస్తా రాక్ చేసి కాకినాడ బీజేపీ జిల్లా అధ్యక్షులు పి రాంకుమార్ ఆధ్వర్యంలో సి ఐ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు కురుసా ఉమామహేశ్వరరావు మరియు రాష్ట్ర గిరిజన మోర్చా కోశాధికారి భి వి భారతి వారి ఇద్దరు మాట్లాడుతూ ఎమ్మెల్సీ దగ్గర డ్రైవర్ గా పనిచేస్తున్న సుబ్రమణ్యాన్ని హత్యచేసి వారు కారు డిక్కీలో వేసుకుని రాత్రి 12 గంటల సమయంలో వారి కుటుంబ సభ్యులకి అప్పగించడాని రావడం జరిగింది కానీ ఇప్పటివరకు ఈ హత్యకు పాల్పడిన ఎమ్మెల్సీ ఉదయ భాస్కర్ ని ఇప్పటి వరకు అరెస్టు చేయకుండా ఎటువంటి చర్య తీసుకోకుండా ఈ రాష్ట్ర పోలీసు వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరును భారతీయ జనతా పార్టీ మరియు రాష్ట్ర గిరిజన మోర్చా దీన్ని తీవ్రంగా ఖండిస్తోంది వెంటనే అనంత బాబు ని అరెస్ట్ చేసి తగు విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తుంది ఈ అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్సీ అనంత బాబుని గిరిజన ప్రాంతమైన భూ అక్రమాలు మహిళల మీద అత్యాచారాలు గిరిజనులకు భయభ్రాంతులు చేసి దోచుకుంటున్న అనంత బాబు పై సిబిఐ ఎంక్వైరీ వేసి విచారణ చేయాలని అలాగే ఆయనయొక్క ఎమ్మెల్సీ పదవిని నుండి భర్తరఫ్ చేయాలని బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు డిమాండ్ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు కురుసా ఉమామహేశ్వరరావు,రాష్ట్ర గిరిజన మోర్చా కోశాధికారి బి వి భారతి, ఉత్తరాంధ్ర గిరిజన మోర్చా జోనల్ ఇంచార్జ్ కురుసా రాజరావు, బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకురి రామ్ కుమార్ ,జిల్లా ఎస్టి,మోర్చా ఇంచార్జి గట్టి సత్యనారాయణ,అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు పాంగి రాజరావు, త్రినాధ్ దేవ్, రాష్ట్ర బిజెపి దళిత నాయకుడు రవికిరణ్ మరియు కాకినాడ జిల్లాలో జిల్లా పరిధి రాష్ట్ర జిల్లా మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలి

## - జె.వి రత్నం గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి తక్షణ కర్తవ్యం కావాలి అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె వి రత్నం పిలుపునిచ్చారు. మే 22 ప్రపంచ జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకరోజు ముందుగా మీదిలాపురి రెవెన్యూ కాలనీలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం పీల్చే గాలిలో రెండు శ్వాసల లో ఆక్సిజన్ లేకుంటే మృత్యువా త పడతా మన్నారు. మనకి ఆక్సిజన్ 50 నుంచి 80 శాతం వరకు సముద్రాల నుండి వస్తున్నారు. అందుకే మనం గాలి పీల్చినప్పుడల్లా సముద్రాన్ని గుర్తు చేసుకోవాలని కోరారు. సముద్రాలు ఆరోగ్యంగా ఉంటేనే సమస్త జీవరాశి మనుగడ ఆనందదాయకంగా ఉంటుంది అన్నారు. సముద్రాలు మనం చెత్త కుండీల వలె వాడితే భవిష్యత్తులో ఆక్సిజన్ దొరకడం కష్టం అవుతుందన్నారు. ఇప్పటికే సముద్రాలలో ఏర్పడుతున్న నిర్జీవ ప్రాంతాలు మనకు ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి అన్నారు. మనం జీవిస్తున్న విధానంలో అత్యధికంగా రసాయనాలు, బార లోహాలు వినియోగిస్తున్నామని ఇవన్నీ వాగులు వంకలు నదులు ద్వారా సముద్రాల లోనికి వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా సముద్రాలలో నిర్జీవ ప్రాంతాలు ఏర్పడుతున్నాయి. దీనిని దృష్టిలోనికి తీసుకొని మనమంతా సముద్రాల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం జీవరాశి జీవించడానికి అనువైన వాతావరణం లేకుండా పోయిందన్నారు. కొంతమంది చేస్తున్న తప్పులకు అడవులు అంతరించి పోయి సమస్త జీవరాశి




మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఏడవ తరగతి విద్యార్థిని మాతల చాతుర్య మాట్లాడుతూ తమ తరం, తర్వాత తరాలు హాయిగా జీవించడానికి అనువైన వాతావరణం కల్పించాలని కోరారు. ఈరోజు శీతోష్ణస్థితి వేడెక్కి పోవడం వల్ల ఏర్పడుతున్న అనర్థాలకు తాము ఇబ్బంది పడుతున్నారువిద్యార్థి మౌన సాయి మాట్లాడుతూ మన పరిసరాల్లో జీవిస్తున్న జీవరాశి కోసం అవసరమైన నీరు, ఆహారం అందుబాటులో ఉంచేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. అలాగే మొక్కలు నాటాలని విత్తనాలు సేకరించి విత్తన బంతులు చేయాలని, వర్షాలు కురిసిన తర్వాత విత్తన బంతులు కొండల మీద చల్లాలని కోరారు. విద్యార్థి నవీన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి జీవ వైవిధ్య పరిరక్షణకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు తామంతా కృషి చేస్తామని అన్నారుఈ కార్యక్రమంలో విద్యార్థులు అధికంగా పాల్గొని మాట్లాడారు.

## వాంటెడ్ పండుగాడ్ ' నుంచి సుడిగాలి సుధీర్ పోస్టర్ విడుదల



శతాధిక చిత్ర దర్శకుడు.. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు సమర్పణలో యునైటెడ్ కె ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సునీల్, అనసూయ భరద్వాజ్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, సప్తగిరి, శ్రీనివాస్ రెడ్డి, సుడిగాలి సుధీర్ ప్రధాన పాత్రధారులుగా శ్రీధర్ సీపాన దర్శకత్వంలో సాయిబాబ కోవెల మూడి, వెంకట్ కోవెల మూడి నిర్మాతలుగా రూపొందుతోన్న చిత్రం 'వాంటెడ్ పండుగాడ్'. 'పట్టుకుంటే కోటి' ట్యాగ్ లైన్. ఇందులో సుడిగాలి సుధీర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా గురువారం చిత్ర యూనిట్ బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''సుడిగాలి సుధీర్ బుల్లి తెర ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. రీసెంట్ టైమ్‌లో సిల్వర్ స్క్రీన్‌పై తనదైన నటనతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు సుధీర్. ఆయన 'వాంటెడ్ పండుగాడ్' సినిమాలో ఓ కీలక పాత్రలో నటించారు. శ్రీధర్ సీపాన దర్శకత్వంలో హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న 'వాంటెడ్ పండుగాడ్'లో సుధీర్ నటన అందరికీ నచ్చుతుంది. ఈ చిత్రానికి ప్రముఖ రచయిత జనార్ధన మహర్షి ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. మారేడుమిల్లిలో పెద్ద షెడ్యూల్‌ను పూర్తి చేశాం. తర్వాత హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొంత షూటింగ్ చేశాం. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. మూడు, నాలుగు రోజులు మాత్రమే బ్యాలెన్స్ ఉంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తాం'' అన్నారు.ఈ చిత్రానికి మహి రెడ్డి పండుగుల సినిమాటోగ్రఫీ, పి.ఆర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## రజనీకాంత్ తన తదుపరి చిత్రానికి ఎంత రెమ్యూనరేషన్ తీసుకుంటున్నాడో తెలుసా?



తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ఇటీవల తన కొత్త ప్రాజెక్ట్‌ను నెల్సన్ దిలీప్ కుమార్ తో ప్రకటించిన సంగతి అందరికి తెలిసిందే. ఈ చిత్రం వచ్చే నెల నుండి సెట్స్ పైకి వెళ్లనుంది అని వార్తలు వినిపిస్తున్నాయి. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం, అన్నత్తే సినిమాకి రజనీకాంత్ 100 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకోగా, ఇప్పుడు ఈ స్టార్ హీరో తన రెమ్యూనరేషన్ ని పెంచినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకి రజినీకాంత్ 150 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో సీనియర్ యాక్ట్రెస్ రమ్యకృష్ణ నెగటివ్ రోల్ లో కనిపిన్చనుంది అని సమాచారం. టెంపరరీగా 'తలైవర్ 169' అని పిలవబడే ఈ చిత్రానిని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. అనిరుధ్ రవిచందర్ దీనికి సంగీతం అందిస్తున్నారు.

## విక్రమ్‌లో సూర్య



కమల్ హాసన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'విక్రమ్'. ఈ చిత్రంలో కమల్‌తో పాటుగా మరో ఇద్దరు నటులు విజయ్ సేతుపతి, ఫహద్ ఫాజిల్ నటిస్తున్నారని గతంలో ప్రకటించారు. తాజాగా సూర్య కూడా ఈ చిత్రంలో భాగమయ్యారని దర్శకుడు లోకేష్ కనగ్ రాజ్ స్పష్టం చేశారు.

## 'విక్రమ్' తెలుగు రైట్స్ ని సొంతం చేసుకున్న ప్రముఖ తెలుగు హీరో



లోకేష్ కానగరాజ్ డైరెక్షన్ లో కమల్ హాసన్, ఫహద్ ఫాసిల్, విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ''విక్రమ్'' సినిమా వస్తుంది అని అందరికి తెలిసిన విషయమే. కాళిదాస్ జయరామ్, నరైన్, అర్జున్ దాస్ అండ్ శివాని నారాయణన్ సహాయక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ఈ చిత్రంలో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య అతిధి పాత్రలో కనిపించనున్నాడు. లేటెస్ట్ రిపోర్ట్స్ ప్రకారం, టాలీవుడ్ హీరో నితిన్ హోమ్ బ్యానర్ శ్రేష్ఠ్ మూవీస్ ఈ క్రేజీ సినిమా తెలుగు రైట్స్ ని ఫ్యాన్సీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'విక్రమ్' సినిమా జూన్ 3, 2022న థియేటర్లలో విడుదల కానుంది. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్ అండ్ ఆర్ మహేంద్రన్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు.



తారక్ పుట్టినరోజు సందర్భంగా పిక్ ని పోస్ట్ చేసి విషెస్ చెప్పిన రామ్ చరణ్ టాలీవుడ్ స్టార్ హీరోస్ జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి నటించిన 'ఆర్ఆర్ఆర్' సినిమా బాక్స్‌ఆఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమా ఈ స్టార్ హీరోస్ ని మంచి స్నేహితులను చేసిందని సినిమా ప్రమోషన్స్‌లో చాలాసార్లు చెప్పారు. తాజాగా ఈరోజు తారక్ పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ సోషల్ మీడియాలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి ఒక ఫోటోని పోస్ట్ చేసారు. బ్రదర్, కో స్టార్, స్నేహితుడు నువ్వు నాకు ఏమవుతావో అని చెప్పడానికి పదాలు సరిపోతాయని నేను అనుకోను! అంటూ ఫోటోకి ఈ స్టార్ యాక్టర్ కాప్షన్ ఇచ్చాడు. ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియా అండ్ ఇంటర్నెట్ లో వైరల్‌గా మారింది.


## 'ఎస్ఎస్ఎం28' సినిమా గురించి లేటెస్ట్ అప్డేట్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో సినిమా వస్తుంది అని అందరికి తెలిసిన విషయమే. ఈ మూవీకి టెంపరరీగా '%బూవీదీ%28' అని టైటిల్ పెట్టారు. మహేష్ సరసన పూజా హెడ్గే నటిస్తుండగా, థమన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ నెల నుండి ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ని ప్రారంభించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. తాజా రిపోర్ట్స్ ప్రకారం, ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం నానిని సంప్రదించగా ఆయన రిజెక్ట్ చేసినట్లు ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఇప్పుడు ఈ పాత్ర కోసం సుశాంత్‌ను సంప్రదిస్తున్నట్లు లేటెస్ట్ టాక్. సుశాంత్ ఇప్పటికే త్రివిక్రమ్‌తో 'అల వైకుంఠపురంలో' సినిమా చేశాడు. మరి సుశాంత్ ఈ రోల్ కి గ్రీన్ సిగ్నల్ ఇస్తాడో లేదో వేచి చుడాలిసిందే. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ట్రాక్ లో రానున్న ఈ సినిమాని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తుంది.

## విడాకుల బాటలో బాలీవుడ్ దంపతులు!





ప్రేమలో ఉన్న అనురాగం పెళ్లి చేసుకున్నాక ఎక్కువ కాలం నిలవట్లేదు. ఈ ధోరణి సెలబ్రిటీల జీవితాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఏళ్ల పాటు ప్రేమగీతాలు పాడుకున్న తారలు పెళ్లయ్యాక మాత్రం కొన్ని సంవత్సరాలకే ముఖం చాటేస్తున్నారు. దారులు వేరంటూ విడాకులు తీసుకుంటున్నారు. తాజాగా మరో బాలీవుడ్ జంట విడాకులకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నిజానికి వీరు చాలాకాలంగా విడివిడిగాజీవిస్తుండగా తాజాగా తమ బంధానికి శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఓ వార్త ఫిల్మీదునియాలో వైరల్‌గా మారింది. కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు ఎంతోమంది వీరిని కలపడానికి ట్రై చేసినా ఇమ్రాన్ మాత్రం ఒక్క మెట్టు కూడా తగ్గడం లేదట. పెళ్లి అనేది తన జీవితంలో ముగిసిన అధ్యాయమని భావిస్తున్నాడట. అతడి మనసు మారదని అర్థమైన అవంతిక బంధాన్ని తెచ్చుకోవడానికి సిద్ధమైనట్లు సమాచారం. కాగా ఇమ్రాన్, అవంతికలు ఎనిమిదేళ్లపాటు డేటింగ్ చేసిన అనంతరం 2011లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇమారా అనే ఏడేళ్ల కూతురు ఉంది. ఇదిలా ఉంటే ఇమ్రాన్ ఖాన్ 'జానే తు యా జానే నా' సినిమాతో 2008లో ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు. కిడ్నాప్, ఢిల్లీ బెల్లీ, ఐ హేట్ లవ్ స్టోరీస్, గోరీ తేరే ప్యార్ మే వంటి పలు చిత్రాల్లో నటించాడు. ఆయన చివరగా 2015లో కట్టి బట్టి సినిమాలో కనిపించాడు. ఆ తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పాడు.


## సత్యం... శివం... సుందరం... పాట

హీరో రాజశేఖర్ తాజా చిత్రం 'శేఖర్'. జీవితా రాజశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ క్రమంలో సినిమాలో 'సత్యం.. శివం.. సుందరం' పాటను గురువారం విడుదల చేశారు మేకర్స్. లిరికల్ సాంగ్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేశారు. ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించగా.. విజయ్ యేసుదాస్, ఉమానేహా ఆలపించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు. రాజశేఖర్, ఆయన కూతురు శివానీ నటించారు. వారి మధ్య సాగే ఎమోషనల్ సాంగ్‌గా ఆకట్టుకుంటోంది.



## ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సొంతం

## నిఖత్ చారిత్రక పంచ్



ఇస్తాంబుల్ : భారత బాక్సర్ నిఖత్ జరీన్ దేశం గర్వపడే ప్రదర్శన చేసింది. 2022 ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు పసిడి పతకం సాధించింది. గురువారం జరిగిన మహిళల 52 కేజీల విభాగం పసిడి పోరులో థారులాండ్ బాక్సర్ జిట్‌పాంగ్ జుటామస్‌పై నిఖత్ జరీన్ ఏకపక్ష విజయం నమోదు చేసింది. ఐదుగురు న్యాయమూర్తులు నిఖత్ జరీన్‌ను ఏకగ్రీవ విజేతగా ఎంచుకున్నారు. 5-0తో తిరుగులేని విజయం సాధించిన అరంగేట్రంలోనే ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. గత 14 ఏండ్లలో ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించిన రెండో భారత బాక్సర్‌గానూ నిఖత్ జరీన్ రికార్డు నెలకొల్పింది. ఈ సమయంలో దిగ్గజ బాక్సర్ ఎంసీ మేరీకోమ్ మాత్రమే ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పంచ్ సంధించింది. ఆరుసార్లు చాంపియన్ ఎంసీ మేరీకోమ్ (2002, 2005, 2006, 2008, 2010, 2018), సరితాదేవి (2006), జెన్నీ ఆర్‌ఎల్ (2006), లేఖ కెసి (2006)ల తర్వాత ప్రపంచ బాక్సింగ్ పసిడి సొంతం చేసుకున్న భారత బాక్సర్‌గా నిఖత్ జరీన్ ఎలైట్ జాబితాలో చేరిపోయింది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తొలి రౌండ్ నుంచి పసిడి పోరు వరకు అన్ని బౌట్లలోనూ నిఖత్ జరీన్ ఏకగ్రీవ విజయాలు నమోదు చేయటం విశేషం.

నిఖత్ దూకుడు : నాలుగేండ్ల విరామం అనంతరం ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం తిరిగి భారత్ గూటికి చేరుకుంది. తొలి రౌండ్ అద్వితీయ ప్రదర్శన చేసిన నిఖత్ జరీన్ ఫైనల్లోనూ అదే వ్యూహంతో బరిలో నిలిచింది. పసిడి పోరులో ప్రత్యర్థి థారులాండ్ బాక్సర్ జిట్‌పాంగ్ జుటామస్‌పై గతంలో నిఖత్ జరీన్ విజయం సాధించింది. గత రికార్డు అనుకూలత భారత బాక్సర్‌కు ఉంది. అయినా, ఫైనల్లో నిఖత్ ఏమాత్రం ఏమరపాటుగా లేదు. సహజంగా నిఖత్ జరీన్ బ్యాక్‌ఫుట్ బాక్సర్.



## ఘనంగా ఆది, నిక్కీల వివాహం

యంగ్ హీరో ఆది పినిశెట్టి ఓ ఇంటివాడయ్యాడు. కోలీవుడ్ హీరోయిన్ నిక్కీ గల్రానీతో అతడు ఏడుగులు నడిచాడు. చెన్నైలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి వీరి వివాహం జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులతోపాటు అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. స్నేహితుడి పెళ్లి సంబరాల్లో నేచురల్ స్టార్ నాని, యువ కథానాయకుడు సందీప్ కిషన్ సందడి చేశారు. కాగా ఆది, నిక్కీ ఎంతోకాలంగా ప్రేమించుకుంటున్నారు. 2015లో వచ్చిన 'యాగవరైనమ్ నా కక్కా' అనే సినిమాలో ఈ ఇద్దరూ జంటగా నటించారు. ఆ సమయంలో స్నేహితులుగా మారిన వీరు 'మరగాధ నాణ్యం' చిత్రంతో ప్రేమికులయ్యారు. వివాహంతో ఇప్పుడు ఒక్కటయ్యారు.

# విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చి దిద్దాలి



ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తయిన కాలనీ ఇళ్లకు ప్రభుత్వ ఖర్చులతో కరెంటు మీటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జలకళ పథకం కింద 1438 రైతులు బోర్లు కోసం ధరఖాస్తు చేసారన్నారు. ఈ పథకం కింద రైతులకు రూ 2లక్షల వరకు ప్రభుత్వం సబ్సిడి ఇస్తున్నదన్నారు. విశాఖనగరంలో 24గంటల నిరంతర విద్యుత్తుతో పాటు, పొల్యూషన్ రహిత నగరంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికై ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

పౌర సరఫరాల శాఖా మంత్రి కరుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతు నుండి ప్రతి గింజ కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు నష్టపోకూడదని ఆర్.బి.కె. సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైసు మిల్లర్లకు ధాన్యం పండించే రైతులకు మధ్య, ఆర్.బి.కె.సెంటర్లు ఉంటాయన్నారు. రైతుల ఖాతాల్లోకి నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. అంతకు ముందు అటవీ శాఖ మంత్రి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అటవీశాఖ, విద్యుత్, గనుల శాఖల పని తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఆ యా శాఖల అధికారులు వారి కార్యక్రమాలు వాటి ప్రగతి తదితర విషయాల పై ప్రెజెంటేషన్ గావించారు.



### సరుకుల లభ్యత, నాణ్యత, ధరలు తదితర

# అంశాలపై దృష్టి సారించాలి

### పౌర సరఫరాల శాఖా మంత్రి కరుమూరి వెంకట నాగేశ్వరరావు



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : నిత్యావసర సరుకులు ప్రజలందరికి లభించాలని వాటి నాణ్యత, బరువు, ఖరీదు తదితర విషయాలలో రాజీపడకూడదని పౌర సరఫరాల శాఖా మంత్రి కరుమూరి వెంకట నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ అతిధి గృహంలో మంత్రి పౌర సరఫరాల శాఖా కమిషనర్ గిరిజా శంకర్ తో కలిసి విశాఖపట్నం, అనకాపల్లి మరియు విజయనగరం జిల్లాల జాయింట్ కలెక్టర్లు తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీ, మార్కెట్ లో వివిధ నిత్యావసరాలు, ఆయిల్స్, గౌడన్స్ నిర్వహణ మరియు తనిఖీ లను నిర్వహించాలన్నారు. ధాన్యం ప్రోక్యూర్ మెంట్ పై దృష్టి సారించి రైతులకు లబ్ధికలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పౌర సరఫరాల శాఖా కమిషనర్ గిరిజా శంకర్ మాట్లాడుతూ లబ్దిదారులు మరియు వినియోగ దారులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. ఈ సమీక్ష సమావేశంలో విశాఖ, విజయనగరం మరియు అనకాపల్లి జాయింట్ కలెక్టర్లు, విజిలెన్స్ అండ్ ఎన్ పోర్స్ మెంట్ అధికారిణి స్వరూపరాణి, పౌర సరఫరాల శాఖాదికారులు, తూనికలు కొలతల శాఖాధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటికి జనం అల్లాడుతున్నారు

### బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, జనం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. జనం సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం జగన్‌కు ఆయన లేఖ రాశారు.

తాగు, సాగునీరు పుష్కలంగా ఉండే ఏలూరు జిల్లాలో ప్రభుత్వ చేతకానితనం వల్ల జనం దాహర్తితో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సత్యసాయి తాగునీటి పథకం 2008లో ప్రారంభించారని, ఈ పథకం ద్వారా పోలవరం, చింతలపూడి, గోపాలపురం, కొవ్వూరు పరిధిలోని 275 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. అయితే ఈ పథకం



285 రోజులుగా నిలిచిపోయిందని, కనీసం ఎందుకు నిలిపివేశారన్న విషయం కూడా ప్రభుత్వం చెప్పే పరిస్థితి లేదన్నారు. వెంటనే ఈ పథకానికి నిర్వహణ వ్యయం కేటాయించి, తాగునీటిని పంపిణీ చేయాలని జగన్‌ను కోరారు.

# వేడుకగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం సందర్భంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ వేడుకగా నిర్వహించారు.ముందుగా శ్రీ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళ,వాయిద్యాల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు,అర్చకులు మరియు దేవస్థానం అధికారులు,సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వార్డ్ అభివృద్ధికై కట్టుబడి ఉన్నాము

### - రాంజీ ఎస్టేట్ లో నూతన రోడ్లు ప్రారంభించిన గంకల కవిత అప్పారావు



కంచరపాలెం(విజయభాను న్యూస్) :

వార్డ్ అభివృద్ధికై కట్టుబడి ఉన్నామని గ్రేటర్ విశాఖ 48వ వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు అన్నారు.జీవీఎంసీ ఏడాది పాలన సందర్భంగా వార్డునకు 5లక్షలు కేటాయించిన తరుణంలో ప్రజా అవసరాలు దృష్యా గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన 48వ వార్డ్ లో సీసీ రోడ్లు,సిమెంట్ మెట్లకు నిర్మాణం కొరకు వినతి అందించగానే నగర్ మేయర్,జీవీఎంసీ కమీషనర్ సహకరించరని తెలిపారు.ఈ సందర్భంగా శనివారం వార్డులో గల రాంజీ ఎస్టేట్ లో నూతనంగా నిర్మించిన రోడ్లు,మెట్లను ఆమె చేతులమీదుగా కొబ్బరికాయ కొట్టి,రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన రోడ్డు ప్రారంభం చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు.వార్డులో గల గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో తలెత్తిన ఎటువంటి సమస్యనైనా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.గ్రామాల అభివృద్ధి ముఖ్య లక్ష్యమన్నారు.ఈ సందర్భంగా వార్డులో పలువురు పెద్దలు గంకల దంపతులను సాలువాతో సత్కరించి పూల మాల వేసి సత్కరించారు.ఈ సందర్భంగా వార్డ్ ప్రజలు మాట్లాడుతూ గంకల వలనే ఇలాంటి అభివృద్ధి పనులు సాధ్యమవుతాయన్నారు.వార్డ్ అభివృద్ధి ప్రతి ఒక్కరు సహకారం అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలో 3 బంగారు, 2 సిల్వర్ పతకాలు సాధించిన

# పోలీస్ కానిస్టేబుల్ ను అభినందించిన : జిల్లా ఎస్పీ



అల్లూరి సీతారామరాజు జిల్లా (విజయభాను న్యూస్): పెదబయిలు పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సిహెచ్.శ్రీనివాసరావు, పిసి:1220, తేది.11 నుండి 15.05.2022 న బెంగళూరు జరిగిన 1వ పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలలో పాల్గొని 1)100 మీటర్ల బటర్ ఫ్లై, 2) 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 3)200 మీటర్ల ఐ.ఎం లో బంగారు పతకాలు, 4)50 మీటర్ల బటర్ఫ్లై, 5)4ఐ50 మీటర్ల మెడ్లే రిలే సిల్వర్ పతకాలను సాధించారు. ఏ.ఎస్.అర్ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపిఎస్ తన కార్యాలయంలో అభినందనలు తెలియజేశారు.

భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి పేరుతేవా లని ఆకాంక్షించారు. నవంబర్ నెల 2022 సంవత్సరంలో గోల్డ్ కోస్ట్, ఆస్ట్రేలియా దేశంలో అంతర్జాతీయ పాన్ పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ కి ఎంపికైన సందర్భంగా జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఆర్ జిల్లా ఎస్.బి డి.ఎస్.పి మూర్తి పాల్గొన్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com